



'ఓట్ చోర్-గద్దీ చోడ్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని కప్పరాడలో ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల


ఎయిర్‌పోర్టులో దక్షిణాఫ్రికా క్రికెటర్లు


మహిళా క్రికెటర్ల సాధన

వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా గురువారం ఇక్కడ దక్షిణాఫ్రికా జట్టుతో తలపడనున్న భారత మహిళా క్రికెటర్లు మంగళవారం సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ముమ్మర సాధన చేశారు. హెడ్ కోచ్ అమల్ మజుందర్, బౌలింగ్ కోచ్ అవిష్కర్ సాల్వి, ఫీల్డింగ్ కోచ్ మునిష్ బాలి పర్యవేక్షణలో క్రికెటర్లు ప్రాక్టీస్ చేశారు.

నగరానికి దక్షిణాఫ్రికా జట్టు

సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన దక్షిణాఫ్రికా క్రికెటర్లు అక్కడ నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.

- వివరాలు స్పోర్ట్స్ పేజీలో...



నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న భారత మహిళా క్రికెటర్లు శ్రీచరణి, రాధా యాదవ్

దొంగ ఓట్లతోనే మోదీ గెలుపు

- పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆరోపణ
- నగరంలో ఓట్ చోర్-గద్దీ చోడ్ క్యాంపెయిన్ నిర్వహణ

విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోర్-గద్దీ చోడ్ (ఓట్ల దొంగ-గద్దె దిగండి) నినాదంతో కాంగ్రెస్ పార్టీ మంగళవారం సాయంత్రం నగరంలో కార్యక్రమం నిర్వహించింది. ఉత్తర నియోజకవర్గ పరిధిలో జరిగిన ఈ క్యాంపెయిన్‌లో పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో ఆమె మమేకమై సంతకాలు సేకరించారు. ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజలకు షర్మిల వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందని, దొంగ ఓట్లతో మోదీ గెలిచారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సంతకాలు చేస్తున్నారన్నారు.కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డాల వర్మరాజు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి లక్కరాజు రామారావు, నాయకులు ప్రియాంక దండి పాల్గొన్నారు.

అంబుజాకు అడ్డగోలుగా భూములు

గంగవరం పోర్టు కోసం కేటాయించిన ల్యాండ్స్‌ను దుర్వినియోగం చేస్తున్న 'అదానీ'

- ఇది ముమ్మాటికీ నిబంధనలకు విరుద్ధం
- 'ఆరెంజ్' పరిశ్రమ అంటూ అబద్ధం
- కణితి గెడ్డ పక్కనే సిమెంట్ పరిశ్రమ
- జీవ వైవిధ్యం దెబ్బతింటుందని ప్రజా శాస్త్రవేత్తల బృందం ఆందోళన
- వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు, స్థానికులు, నాయకులు
- నేడు నడుపూరులో ప్రజాభిప్రాయ సేకరణ


అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయతలపెట్టిన ప్రాంతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గాజువాక నియోజకవర్గం మొత్తం ఏకమవుతోంది. నడుపూరులో బుధవారం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు ప్రజా సంఘాలు, కాలనీ వాసులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సిద్ధమవుతున్నారు. దీంతో వేదిక వద్ద శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఏర్పడింది. గంగవరంలో పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో భూములు కేటాయించింది. వాటిని పోర్టు అవసరాలకు మాత్రమే వినియోగించాలి. సబ్ లీజులకు ఇవ్వడానికి, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉండడంతో అదానీ యాజమాన్యం తాను అనుకున్నది చేయాలని మొండిగా ముందుకు వెళుతోంది. పెదగంట్యాడలో కణితి గెడ్డను ఆనుకొని సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. గంగవరం పోర్టు కాలుష్యానికి సిమెంట్ పరిశ్రమ కాలుష్యం కూడా తోడైతే పెదగంట్యాడ, గాజువాకల్లో అనేక ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధ పడాల్సి వస్తుంది. ఆ విషయం తెలిసి అక్కడి వారంతా ఈ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారు. అసలు ప్రజాభిప్రాయ సేకరణే వద్దని డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు, వామపక్షాల సంఘాలు దీనిపై గత నెల రోజులుగా పోరాటం చేస్తుండగా ఇప్పుడు వారికి కూటమి పార్టీ నాయకులు కూడా జత కలిశారు. చాలామంది కార్పొరేటర్లు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ప్రత్యేకంగా లేఖలు రాసి, సిమెంట్ పరిశ్రమ వద్దని డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి వనంలో తులసిమొక్క అంటూ...

అదానీ యాజమాన్యం అంబుజా సిమెంట్ పరిశ్రమ ... మిగతా 6వ పేజీలో

అంబుజాకు అనుమతి నిరాకరించాలి

- కలెక్టర్‌కు డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు వినతిపత్రం


జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు

గాజువాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతి నిరాకరించాలని జిల్లా కలెక్టర్‌కు మంగళవారం నగర డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల వల్ల ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వొద్దని కోరారు. అటువంటి ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామని పేర్కొన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీకి వ్యతిరేకం

- గంధం శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్

అదానీ నిర్మించదలసిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారు. ఇప్పటికే పెదగంట్యాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల వల్ల తీవ్ర కాలుష్యం వస్తుంది. దీనికి తోడు ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఇంకా ఇబ్బందులు వస్తాయి. ఈ ఫ్యాక్టరీని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు

- ఏయూ పరిధిలో సుమారు 30కి పైగా కళాశాలలకు సమస్య
- లైబ్రరీ ఫండ్, అఫ్లియేషన్ ఫీజు చెల్లించకపోవడమే కారణం
- రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరి ఫీజులూ చెల్లించాలని మెలిక
- ధ్రువపత్రాల కోసం వర్సిటీని ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- బకాయిలు చెల్లిస్తేనే పంపిస్తామంటున్న అధికారులు



విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాలేజీలు ఫీజులు చెల్లిస్తే తప్ప విద్యార్థుల సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు అంగీకరించడం లేదు. ఇది విద్యార్థులకు ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ప్రస్తుతం ఏయూ పరిధిలోని సుమారు 30కు పైగా కాలేజీలు ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులు చెల్లించే ఫీజుల్లో కొంత మొత్తాన్ని కాలేజీలు వివిధ ఫీజుల రూపంలో వర్సిటీకి చెల్లిస్తుంటాయి. అయితే, ఫీజు రీయింబర్స్‌మెంట్ కాకపోవడంతో అనేక కాలేజీలు వర్సిటీకి ఫీజులు చెల్లించడంలో జాప్యం చేస్తూ వస్తున్నాయి. కానీ, ఇప్పటికే కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు మాత్రం సర్టిఫికెట్లు ఇవ్వా లంటూ కాలేజీ యాజమాన్యాలను కోరుతున్నారు. సదరు కాలేజీ యాజమాన్యాలు స్పందించకపోవడంతో నేరుగా వర్సిటీని సంప్రతిస్తున్నారు. అటువంటి విద్యార్థులకు సద రు కాలేజీ యాజమాన్యాలు ఫీజులు పెండింగ్ ఉన్న విష యాన్ని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఆయా ఫీజులను చెల్లించిన తరువాత సర్టిఫికెట్లను కాలేజీలకు పంపిస్తామని చెబుతుండడంతో ఏమీ చేయలేని స్థితిలో విద్యార్థులు ఉంటున్నారు.

నో డ్యూ సర్టిఫికెట్ ఇస్తేనే...

ఏయూ పరిధిలో సుమారు 300 వరకు కాలేజీలు (డిగ్రీ, పీజీ) ఉన్నాయి. ఆయా కాలేజీల్లో సుమారు 40 వేల మంది చదువుతున్నారు. వీరిలో చాలా మంది విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులను చెల్లిస్తోంది. విద్యార్థికి ప్రభుత్వం చెల్లించే ఫీజుల్లో కొంత మొత్తాన్ని కాలేజీ యాజమాన్యాలు వివిధ రకాల ... మిగతా 6వ పేజీలో

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు



విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి వీఎంఆర్‌డీఏలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. 30 జూన్, 2025లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల(ఇళ్ల స్థలాలు)కు మాత్రమే ఈ పథకంలో క్రమబద్ధీకరిస్తారు. నిర్ణీత ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకుంటే ఆయా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. భవిష్యత్తులో లావాదేవీలకు ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవు. నిర్మాణాలకు అవసరమైన మొత్తాలు బ్యాంకులు రుణంగా ఇస్తాయి. రిజిస్ట్రేషన్ పత్రాలతో నేరుగా గాని, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ)తో గాని దరఖాస్తు చేసుకోవాలి. ఏపీ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకానికి కొనసాగింపుగా ఈ అవకాశం కల్పించింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్, కమిషనర్ సంయుక్త ప్రకటనలో కోరారు.

ఫైనల్ సెటిల్‌మెంట్‌లోనూ జాప్యం

రెండో విడతలో వీఆర్‌ఎస్ తీసుకున్న ఉద్యోగులకు ఉక్కు యాజమాన్యం హ్యాండ్

తమకు రావలసిన డబ్బుల కోసం వారం రోజులుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

- 4 వాయిదాల్లో ఇస్తామంటున్న అధికారులు
- కేంద్రం కేటాయించిన డబ్బులు ఏమైనట్టు....?



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) స్టీల్ ప్లాంటు యాజమాన్యం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారిని ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటోంది. ఒకేసారి ఈ మొత్తం ఇవ్వాల్సి ఉండగా, వాయిదాల్లో ఇస్తామని బేరాలు ఆడుతోంది.

ప్లాంటులో పెరిగిన పని గంటలు, సకాలంలో అందని జీతాలు, ఎప్పుడు ఎలాంటి డ్యూటీ చేయాల్సి వస్తుందోననే భయంతో చాలామంది ఉద్యోగులు బయటకు వెళ్లిపోవడానికి యత్నిస్తున్నారు. ఇదే అదనుగా యాజమాన్యం స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్‌ఎస్) ప్రకటించగానే కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందాయి. తొలి విడత వీఆర్‌ఎస్‌లో 1,140 మందిని ఇంటికి పంపించేశారు. వారికి ఈ ఏడాది మార్చిలో సుమారుగా రూ.450 కోట్లు చెల్లించారు. ఇందుకోసం ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించడం గమనార్హం. ఇంకా ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని ఢిల్లీ నుంచి ఆదేశం రావడంతో రెండో విడత వీఆర్‌ఎస్ ప్రకటించారు.అందులో దరఖాస్తులన్నీ వడపోసి 480 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి సెప్టెంబరు 30తో సర్వీసు ముగించారు. అదేరోజున వారికి ఇవ్వాల్సిన మొత్తాలన్నీ చెల్లించాలి. దేశంలో ఎక్కడైనా, ఏ సంస్థ అయినా వీఆర్‌ఎస్ ఇస్తే..చివరి పనిదినం నాడే పరిష్కారం మొత్తం అందిస్తుంది. స్టీల్ ప్లాంటు కూడా వీఆర్‌ఎస్-1లో ఇలాగే మార్చి 31న అందరికీ డబ్బులు ఇచ్చింది. కానీ ఈసారి వీఆర్‌ఎస్-2 దగ్గరకు వచ్చేసరికి దోబూచులాడుతోంది. నిధులు లేవని చెబుతోంది. వారం రోజుల నుంచి వీఆర్‌ఎస్ తీసుకున్న వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు అప్పులు ఉన్నాయని, వారికి సమాధానం చెప్పుకోవాలని, ఎప్పుడు సెటిల్‌మెంట్ చేస్తారో చెప్పాలని కొందరు గట్టిగా నిలదీస్తే...ఒకేసారి ఇవ్వలేమని ఆర్థిక శాఖ అధికారులు చావు కబురు చల్లగా చెబుతున్నారు.సెటిల్‌మెంట్ మొత్తం నాలుగు వాయిదాలలో 25 శాతం చొప్పున ఇస్తామని సెలవిచ్చినట్టు తెలిసింది. దీనిపై ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. ఉక్కు మంత్రిత్వ శాఖ వీఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా నిధులు ఇచ్చిందని, వాటిని ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యం వేధింపులు తట్టుకోలేక వీఆర్‌ఎస్ తీసుకుంటే...ఇప్పుడు కూడా ఇంకా వేధించడం తగదని, ఇది మంచి విధానం కాదని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని 480 మందికి ఇవ్వాల్సిన మొత్తాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో మోస్తరు వర్షం



విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఉదయం నుంచీ భానుడి ప్రతాపంతో జనం అల్లాడారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అనేక ప్రాంతాల్లో మేఘాలు కమ్మి చిరుజల్లులు కురిశాయి. ఎయిర్‌పోర్టు, షీలానగర్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో నగరవాసులు భయాందోళనకు గురయ్యారు.

లోన్ యాప్‌లతో జాగ్రత్త

- పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి
- సైబర్ నేరగాళ్ల ఖాతాల నుంచి రికవరీ చేసిన రూ.7.2 లక్షలు బాధితులకు పంపిణీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, అక్టోబరు 87 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఖాతాల నుంచి రికవరీ చేసిన రూ.7.2 లక్షల నగదును నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఇన్‌స్టెంట్ లోన్ యాప్ బాధితులకు అందజేశారు. పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు వేసే ఎత్తులో ఇన్‌స్టెంట్ లోన్ యాప్ అనేది ఒకటన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రుణాలు తీసుకుంటారన్నారు. రుణం తీసుకున్న తర్వాత సైబర్ నేరగాళ్లు తమ అసలు స్వరూపాన్ని చూపిస్తారన్నారు. రుణం తీసుకున్న వెంటనే తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడం తోపాటు పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా ఇంకా చెల్లించాల్సి ఉందంటూ వేధిస్తారన్నారు. ఎవరైనా ఇక చెల్లించబోమని చెప్పినా, వారి బాధ తట్టుకోలేక ఫోన్‌ను ఆపేసినా వారి ఫోన్‌లోని కాంటాక్ట్‌లకు బాధితుల న్యూడ్ ఫొటోలు, వీడియోలను ఎడిటింగ్ చేసి పంపించి బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. దీనిని తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడితే, మరికొందరు ఎవరి వద్దనైనా అప్పులు చేసి సైబర్ నేరగాళ్లకు చెల్లింపులు జరుపుతూనే ఉంటారన్నారు. ఈ తరహా మోసాలకు ... మిగతా 6వ పేజీలో

ముందస్తు పరీక్షలతో స్ట్రోక్స్‌కు చెక్



- హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం
- జీవన విధానంలో మార్పులతోపాటు కొన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం
- సమస్యను ముందుగా గుర్తించి వైద్య సేవలందిస్తే ప్రాణాపాయం తప్పుతుందంటున్న వైద్య నిపుణులు

-8లో

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడాలి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఘనంగా పార్టీ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం కంచుకోటగా పేరొందిన భీమిలి నియోజకవర్గంలో అన్ని స్థానాల్లోనూ టీడీపీ జెండా రెపరెపలాడాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన టీడీపీ మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని మంగళవారం మండలంలోని చిప్పాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు జీవీఎంసీలో విలీన ప్రతిపాదన ఉన్నందున, జీవీఎంసీలో విలీనమైతే కార్పొరేషన్ ఎన్నికలు, లేని పక్షంలో పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో తనను 93 వేల మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అదే స్థాయిలో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. అదే స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో కూడా కార్యకర్తలు పని చేసి అన్ని స్థానాల్లో విజయం చేకూర్చాలని కోరారు. భీమిలి మండల కమిటీ నూతన అధ్యక్షుడు సరగడ అప్పారావు ఓటమి ఎరుగని సీనియర్ నాయకుడని, ఆయన నేతృత్వంలో మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. దేశంలోనే మొట్టమొదటిగా కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన పార్టీ తెలుగుదేశమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ అనుభవం, సీఎం చంద్రబాబు విజన్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చరిష్మాతో రాష్ట్రం శరవేగంగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేసుకుంటూ కూటమి పాలన ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు హామీ ఇవ్వని వాహనమిత్ర పథకాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తుండడం విశేషమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంట్లో పిల్లలందరికీ 'అమ్మఒడి' అందిస్తామని చెప్పి, చివరికి ఒకరికే వర్తింపజేసి మోసం చేసిందని, నిరుపేదలకు పింఛను పెంచే విషయంలో కూడా జగన్మోహనరెడ్డి మోసం చేశారని విమర్శించారు.

భీమిలి మండల టీడీపీ కమిటీ నూతన అధ్యక్షుడు సరగడ అప్పారావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మండల అధ్యక్ష పదవికి ఎంపిక చేశారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీలో అన్ని వర్గాలను కలుపుకొని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అనంతరం సరగడ అప్పారావు, ఉపాధ్యక్షులు గరికిన పరశురామ్, ప్రధాన కార్యదర్శి పొట్నూరు రాము, తదితర కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే గంటా ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల జంక్షన్ నుంచి చిప్పాడ వరకూ టీడీపీ కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బైక్ నడుపుతూ యువనాయకులు గంటా రవితేజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే.. చిప్పాడలోని షిర్డీ సాయి మందిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా రవితేజ, చిక్కాల విజయ్‌బాబు, భీమిలి మండల జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, చుక్క ఈశ్వరమ్మ, కార్పొరేటర్ లొడగల అప్పారావు, మండల సీనియర్ నాయకులు బోర బంగారురెడ్డి, గాడు తాతినాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ బోర రాధాకుమారి, అక్కరమాని వెంకటరావు, ఆనందపురం, టీడీపీ పద్మనాభం మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కురిమిన లీలావతి, బమ్మిడి ఉమ, గాడు అప్పలనాయుడు, పాసి నర్సింగరావు, గొలగాని నరేంద్రకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం



ఆనందపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలసలో ఒక గొడౌన్‌లో నిల్వ చేసిన సుమారు రూ.లక్ష మందుగుండు సామగ్రిని స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఆనందపురం గ్రామానికి చెందిన మేడిశెట్టి రాంజీ తదితరులు దీపావళికి మందు గుండు సామగ్రి అమ్మకాలు జరిపేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఒక గొడౌన్‌లో మందుగుండు నిల్వ చేశారు. దీనిపై అందిన సమాచారంతో సీఐ చింతా వాసునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ సంతోష్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.లక్ష మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే మండలంలోని నేల్తేరు, బొడ్డపాలెం గ్రామాల్లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న దాసరి దేముడు, చల్లా లక్ష్మిలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు.

చందక మాజీ సర్పంచ్ మృతి

ఆనందపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందక పంచాయతీ మాజీ సర్పంచ్ రెడ్డి సీతయ్య (72) మంగళవారం కన్నుమూశారు. సీతయ్య కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల డిశార్చ్ అయ్యారు. అయితే మంగళవారం ఆక్సిజన్ లెవెల్స్ ఒక్కసారిగా పడిపోవడంతో ఆయన మృతి చెందారు. ఈయన 1995 నుంచి 2000 వరకు చందక పంచాయితీ సర్పంచ్‌గా సేవలు అందించారు. సీతయ్య మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జీఎస్టీపై విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థులు


వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేసిన ఉపాధ్యాయులు

భీమునిపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణపై అవగాహన పెంపొందించుకోవాలని మండల జీఎస్టీ నోడల్ అధికారి యు.విజయకుమార్ వర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీఎస్టీ సవరణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజువారీ వినియోగించేనిత్యావసర వస్తువులు, స్టేషనరీ, మందులు తదితర వస్తువుల కొనుగోలులో తగ్గిన జీఎస్టీతో ఎంతో ప్రయోజనకరమన్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శివరాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి, మండల డెవలప్‌మెంట్ అధికారి నర్సింగరావు, జీహెచ్ఎస్ హెచ్ఎం పి.రమణ, పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన జీఎస్టీ సవరణపై ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవిద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం వివిధ రకాల పోటీలను నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో వి.జానకి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు సమన్వయంతో క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జానకి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు అమలులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జీఎస్టీ అధికారి పాల్గుణరావు, గ్రామ కార్యదర్శి రఘునాథ్‌బాబు, డిజిటల్ అసిస్టెంట్ చందక వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

అలాగే పద్మనాభంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జీఎస్టీపై విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ప్రయోజనాలను ప్రతీ ఒక్కరూ పొందేలా విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో కె.రూపేష్ అవగాహన కల్పించారు. ఎంఈవో పి.రమణ, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలేశుని దర్శించుకున్న సినీ గాయకుడు రఘు


రఘు కుటుంబానికి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

సింహాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా రంగంలో రచయితగా, నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఉన్న కుంచె రఘు సింహాచల వరాహలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి వచ్చిన ఆయనకు దేవాలయ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న రఘు గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.


దాతకు బాండ్ అందజేస్తున్న అధికారులు

నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళం

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎంఎస్ వెంకటేశ్వర్లు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,001లను నగదు రూపంలో మంగళవారం దేవస్థానం ఏఈఓలు వి.రమణ మూర్తి, కె.తిరుమలేశ్వరరావులకు అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

గాయత్రీ కళాశాలలో ఘనంగా వాల్మీకి జయంతి

సాగర్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల ఎం.బి.ఎ సెమినార్ హాల్‌లో మంగళవారం వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది. సెంటర్ ఫర్ ది స్టడీస్ ఆఫ్‌హ్యూమన్ అండ్ స్పిరిట్యువల్ వాల్యూస్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ప్రగఢ రాజగణపతి.డి.వి.ఎస్.కామేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. సత్యధర్మాల పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడిన శ్రీరాముని వ్యక్తిత్వం నేటి యువతరానికి ఆదర్శమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.యస్.బోస్, సెంటర్ ఫర్ ది స్టడీస్ డాక్టర్ వారణాసి వేంకటేశ్వర శర్మ, డైరక్టర్ ఆచార్య వినయ్, డాక్టర్ సాయిబాల, క్రిష్ణవేణి, డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జ్వరాల బారిన ముబారక్ కాలనీవాసులు



ఎండాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ముబారక్‌కాలనీతో పాటు అదే ప్రాంతంలో ఉన్న కాల్వల్లో మురుగునీరు నిలిచిపోయి పరిస్థితి దయనీయంగా మారింది. శానిటేషన్ సిబ్బంది కాల్వలు శుభ్రపరచడంలో విఫలమవుతున్నారు. గతంలో సిబ్బంది లోటు అంటూ దాట వేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం సరిపడా సిబ్బంది ఇవ్వడంతో పాటు వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపంతో ఈ ప్రాంతంలో మురుగు నీరు కాల్వల్లో నిలువ ఉండిపోయి. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో కాలువలు శుభ్రం చేయాలని స్థానికులు విన్నవించుకుంటున్నారు.

ఎండాడ ముబారక్‌కాలనీలోని ఓ కాల్వలో నిల్వ ఉన్న మురుగు నీరు

జీఎస్టీపై విద్యార్థులకు పోటీలు

కొమ్మాది, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై మంగళవారం చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా రవితేజ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాసంక్షేమంలో భాగంగా జీఎస్టీ తగ్గించిందన్నారు. డీఈఓ ప్రేమ్‌కుమార్, హెచ్ఎం వెంకట్రావు, పాఠశాల కమిటీ చైర్మన్ గుదే అచ్యుతరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొమ్మాది కళాశాలకు స్వచ్ఛాంధ్ర అవార్డు

కొమ్మాది, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొమ్మాదిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు 2025-స్వచ్ఛాంధ్ర పురస్కారం లభించింది. కళాశాల డీసీ గ్రేస్, ప్రిన్సిపాల్ ఎస్.సత్యవతిలకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ అవార్డు అందించారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అవార్డుకు తమ కళాశాల ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు.

అప్పన్న ఆలయంలో వైభవంగా తిరువీధి

సింహాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్వియుజ పౌర్ణమిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మంగళవారం వైభవంగా తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులతో సకలాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదపారాయణం నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. మార్గంలో ఎనిమిది దిక్పాలకులకు ప్రత్యేక పూజలు చేసి నీరాజనాలిచ్చారు. ఆస్థాన మండపంలో ప్రత్యేక పూజల తరువాత, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


తిరువీధిలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు


గరుడవాహనంపై గోవిందరాజస్వామి

గోవిందునికి ఘనంగా గరుడసేవ

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఘనంగా గరుడసేవ జరిపారు. దేవస్థానం నిర్ణయించిన రుసుము చెల్లించిన భక్తులు తాము కోరుకున్న రోజున గరుడసేవ జరిపించుకోవచ్చు. దానిలో భాగంగా మంగళవారం ప్రభాతారాధనల తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించి నారసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. మంగళవాయిద్యాల వెంట భక్తులు రజిత వాహనంపైనున్న స్వామి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసి శీతల నివేదనం కావించారు. మంగళనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణోత్సవం

సింహాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం వైభవంగా ఆర్జిత నిత్యకల్యాణోత్సవం నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి వేదికపై ఉంచారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్య సమర్పణలు చేసి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


వేడుకలో పాల్గొన్న భక్తులు

శ్రీకృష్ణానగర్ కాలనీ రహదారిలో ఆక్రమణలు


ఆక్రమణలతో కుచించుకుపోయిన రహదారి

మధురవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీలోని వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్ రహదారులు ఆక్రమణకు గురవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలోని ఓ ఫైనాన్స్ కంపెనీ ఎదురుగా అనధికారికంగా ఒకరు కంటెయినర్లు పెట్టడంతో ఆ రహదారి ఇరుగ్గా మారింది. కొందరు ఈ రహదారులకు ఆనుకొని రేకుల షెడ్లు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ అధికారులు ఈ ఆక్రమణలపై కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. రహదారులను దర్జాగా ఆక్రమించడంతో 30, 40 అడుగుల వెడల్పు రహదారులు ప్రస్తుతం 10 నుంచి 20 అడుగులు మాత్రమే ఉన్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారుల ఆక్రమణపై స్థానికులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, మధురవాడ జోనల్ కార్యాలయాల్లో ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా కనీస స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా పట్టణ ప్రణాళిక అధికారులు స్పందించి శ్రీకృష్ణానగర్ కాలనీలో రహదారులపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన టిఫిన్ దుకాణం... వాహనాల రాకపోకలకు ఆటంకం



వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న పీఎంపాలెంలోని విజేత మార్కెట్-సాంకేతిక కాలేజీ రోడ్డు పక్కన కంటెయినర్ దుకాణం

విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్‌లంగ్స్ పేరుతో రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ అధికారులు కొన్ని చోట్ల ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో ఆక్రమణదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. జోన్-2 పరిధి పీఎంపాలెం విజేత సూపర్‌మార్కెట్ నుంచి సాంకేతిక కాలేజీకి వెళ్లే మార్గాన్ని వీఎంఆర్డీఏ కొన్నాళ్ల కిందట 60 అడుగులు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసింది. రోడ్డు వెడల్పు కావడంతో వాహనాల రాకపోకలు పెరగడంతో ఆ మార్గంలో దుకాణాలు వెలిశాయి. అందులో భాగంగానే ఒకరు రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని ఆక్రమించి ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేశారు. నివాసానికి ప్లాన్ తీసుకుని ఏకంగా మూడు అంతస్తుల్లో దుకాణాలు నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో టీ టైమ్, ఫాస్ట్‌ఫుడ్, ఐస్‌క్రీం దుకాణాలు ఏర్పాటు చేసి రోడ్డుపైకి వచ్చేలా షెడ్డు వేసి కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేసేశారు. దీనికి ఎదురుగా ఒక వ్యక్తి తన జిరాయితీ స్థలమని పేర్కొంటూ రోడ్డు పక్కనే ఒక కంటెయినర్‌ను ఏర్పాటు చేసి ఒకరికి అద్దెకు ఇచ్చే శారు. కంటెయినర్‌లో టిఫిన్ దుకాణం ప్రారంభించడంతో అక్కడ టిఫిన్ చేసేందుకు వచ్చేవారు, కొనుగోలుదారులు తమ వాహనాలు, ఆటోలను రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. దీనివల్ల ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసులకు వెళ్లి వచ్చేవారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చేవారితో రోడ్డుపై వాహనాలరద్దీ ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో రోడ్డుపైన కుర్చీలు, వాహనాల పార్కింగ్ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై జీవీఎంసీ, పోలీస్ అధికారులకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా, స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిడి చేస్తున్నారంటూ అధికారులు చర్యలకు వెనుకడుగువేస్తున్నారు. ఫలితంగా.. ఆమార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది నిత్యకృత్యంగా మారిందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

లోన్ యాప్‌లతో జాగ్రత్త

... 5వ పేజీ తరువాయి

సంబంధించి నగరంలో ఇప్పటివరకూ 317 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని క్రిప్టో కరెన్సీని సీజ్ చేశామన్నారు. దీనిపై న్యాయపరమైన సంప్రతింపులు జరిపి, వివిధ ప్రక్రియలను పూర్తిచేసిన తర్వాత సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చామన్నారు. మొదటి దశలో రూ.48,59,072ను వంద మంది బాధితులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అందజేశామన్నారు. రెండో దశలో భాగంగా 26 మందికి మంగళవారం రూ.7,20,647 అందజేస్తున్నామన్నారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్ మోసాలకు సంబంధించిన కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయని, నగరవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఎవరైనా సైబర్ మోసాలకుగానీ, ఇతర మోసాలకు గానీ గురైతే 7995095799 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వీలైనంత వేగంగా వివరించగలిగితే ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా నిలుపుదల చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బాధితులకు రికవరీ చేసిన మొత్తాన్ని సీపీ అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ ఫల్గుణరావు, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు

... 5వ పేజీ తరువాయి

ఫీజుల రూపంలో వర్సిటీకి చెల్లిస్తుంటాయి. లైబ్రరీ ఫండ్, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజు, కల్చరల్, కరిక్యులమ్, అఫ్లియేషన్ వంటి ఫీజులు ఉంటాయి. ఇవన్నీ చెల్లించిన కాలేజీలకు యూనివర్సిటీ అధికారులు నో డ్యూ సర్టిఫికెట్‌ను ఇస్తుంటారు. నో డ్యూ సర్టిఫికెట్‌ను కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) ఇస్తుంది. అయితే, కొన్నిరకాల కారణాలతో అనేక కాలేజీలు కొన్ని ఫీజులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నాయి. దీంతో వర్సిటీ అధికారులు ఆయా కాలేజీలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. ఇది విద్యార్థులకు ఇబ్బందిగా మారుతోంది.

డ్రాప్ అయిన విద్యార్థులు ఫీజు

ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్స్ ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే రెండో విడత అడ్మిషన్స్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. ఇక్కడ ఒక సమస్య డిగ్రీ కాలేజీలను వేధిస్తోంది. సాధారణంగా కాలేజీల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ఆయా కాలేజీలు యూనివర్సిటీకి చెల్లించడం పరిపాటి. అయితే, ఏయూ అధికారులు అందుకు భిన్నంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులందరి ఫీజులను కాలేజీ యాజమాన్యాలే చెల్లించాలని కోరుతున్నాయి. అదే ఇప్పుడు యాజమాన్యాలకు ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు నగర పరిధిలోని ఒక డిగ్రీ కాలేజీలో చేరేందుకు 150 మంది విద్యార్థులు ఆసక్తి చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, వారిలో చాలామంది రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీల్లో కాకుండా ఇతర కాలేజీల్లో చేరిపోయారు. అయితే, చేరిన కాలేజీల నుంచి కాకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీలు ఫీజులు చెల్లించాలని ఏయూ అధికారులు కోరుతున్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు వేయి రూపాయలువరకు చెల్లించాల్సి రావడంతో కాలేజీలకు భారంగా మారుతోందని చెబుతున్నారు.

అంబుజాకు అడ్డగోలుగా భూములు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుపై అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. తాము పెట్టబోయే పరిశ్రమ 'బి' కేటగిరీకి చెందినదని, ఆరెంజ్ విభాగంలోకి వస్తుందని, దాంతో కాలుష్యం ఉండదని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పేర్కొంది. ఇది శుద్ధ అబద్ధమని ప్రజా శాస్త్రవేత్తల బృందం మంగళవారం తమ లేఖలో కుండబద్దలు కొట్టింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమండల్ వంటి రెడ్ కేటగిరీ పరిశ్రమలన్నీ అక్కడే ఉన్నాయని, వాటి మధ్యలో పెట్టే 'అంబుజా సిమెంట్' పరిశ్రమ 'బి' కేటగిరీలోకి రాదని, ఆరెంజ్ విభాగానికి ఎలా చెందుతుందని ప్రశ్నించారు. గంజాయి వనంలో ఉంటూ తులసి మొక్క అంటే ఎలా అని నిలదీశారు. దీనివల్ల తీర ప్రాంత జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, ఈ విషయాన్ని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో తొక్కి పెట్టారని ఆరోపించింది.

ట్రాఫిక్ అంశాలే లేవు

అదానీ సమర్పించిన నివేదికలో సిమెంట్ పరిశ్రమ వల్ల ఏర్పడే ట్రాఫిక్ గురించి అసలు ప్రస్తావనే లేదని, ఇది చాలా కీలకమని శాస్త్రవేత్త బాబూరావు అన్నారు. ఉత్పత్తి చేసిన సిమెంట్ మొత్తం నౌకల ద్వారా రవాణా చేయరని, తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం, సిమెంట్ ఉత్పత్తిని ఇతర ప్రాంతాలకు పంపడానికి రోజుకు కనీసం 500 భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణం చేస్తాయని పేర్కొన్నారు. ఆ రద్దీని తట్టుకొనే రహదారులు, వ్యవస్థ ఏమీ లేవని, దాంతో వాటిని నివేదికలో పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. లారీల పార్కింగ్, వీల్ వాషింగ్, టార్పాలిన్ కప్పి సరకు రవాణా వంటి అంశాలపై ప్రణాళికే లేదన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల పెదగంట్యాడ-గాజువాక మార్గంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

ఇవేమీ లేవు

పర్యావరణ ప్రభావ అంచనా నివేదిలో లాజిస్టిక్ ప్లాన్, ట్రాఫిక్ ప్రభావం, రవాణా కాలుష్యం, రైలు, షిప్ నెట్‌వర్క్, కన్వేయర్ విధానం, రహదారుల పక్కన కాలుష్యం కొలిచే పరికరాల వంటి అంశాలు ఏవీ ప్రస్తావించలేదని, నామమాత్రంగా తప్పుడు నివేదిక సమర్పించారని, దీనిని అధికారులు పరిగణనలోకి తీసుకోకూడదని ప్రజాశాస్త్రవేత్తల బృందం డిమాండ్ చేసింది.

అంధకారంలో ఎంవీపీ డబుల్ రోడ్డు



డబుల్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో అంధకారం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు అంధకారంలో ఉంది. జాతీయ రహదారి ఐసీఐసీఐ కూడలి నుంచి బీచ్ రోడ్డును కలిపే డబుల్ రోడ్డులో నిత్యం రద్దీగా ఉంటుంది. టీటీడీ కూడలి, టాస్క్‌ఫోర్స్ కూడలి సర్కిళ్లను అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంతానికి కొత్త అందాలు వచ్చినా, ఇటూ అటూ ఉన్న రహదారిలో చీకట్లు అలముకోవడంతోవాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేయడంతోనే సరిపోదని, విద్యుత్తు దీపాల నిర్వహణ కూడా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

'పార్కు నిర్వహణ వదిలేశాం'

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీనివాస ఉద్యానవనం నిర్వహణను తాము చూడటం లేదని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ తెలిపింది.'కళావిహీనంగా శ్రీనివాస ఉద్యానవనం' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైె కథనానికి కమిటీ వివరణ ఇచ్చింది. ఆలయం ఎదురుగా ఉన్న పార్కును తామే నిర్వహిస్తున్నట్లు బోర్డు ఉన్నప్పటికీ తాము కొన్నేళ్లుగా నిర్వహణ చూడడం లేదని కమిటీ కార్యదర్శి కేవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తాము పార్కు నిర్వహణను చూశామని, హుద్‌హుద్ తర్వాతజీవీఎంసీ సహకారం కొరవడటంతో ఇబ్బంది ఎదురైందని తెలిపారు. తర్వాత కూడా కొన్నాళ్లు నిర్వహించామన్నారు. అనంతరం స్థానికులు పార్కు నిర్వహణ కోసం అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పార్కు వద్ద తాము నిర్వహిస్తున్నట్టు ఉన్న బోర్డునుతొలగిస్తామని చెప్పారు.

18వ వార్డులో అన్నసమారాధన

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధి బీచ్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. శ్రీషిర్డీ సాయి చిల్లర వ్యాపారస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సంబరాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 24, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 24, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 20, క్యారెట్ 56, దొండకాయలు 40, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



పిఠాపురం కాలనీ రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు నరికి వేసిన పోగులు



పిఠాపురంకాలనీలో తొలగించని విద్యుత్‌స్తంభం, చెట్ల కొమ్మలు

పిఠాపురం కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే..

- తొలగించని పారిశుధ్య సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

మద్దిలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డులో ఈదురుగాలులకు పడిపోయిన చెట్టు కొమ్మలు ఎక్కడవి అక్కడే ఉన్నాయి. రోడ్డుకు అడ్డంగా పడిన కొమ్మలను నరికి పక్కన పోగులు వేశారు. విజయదశమి రోజున వీచిన గాలులకు వార్డులోని పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. రెండు విద్యుత్ స్థంభాలు నేలమట్టాయి. పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం, మంగాపురంకాలనీ, శివాజీపాలెం, రేసపువానిపాలెం ఏరియాల్లో చెట్టులు, చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో జీవీఎంసీ సిబ్బంది పడిపోయిన చెట్లు, కొమ్మలను నరికి రోడ్డు పక్కన గుట్టలుగా వేశారు. ఆరు రోజులు కావస్తున్న చెట్ల వ్యర్థాలను తొలిగించడం లేదు. దీంతో ఎక్కడికక్కడే పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు గుట్టలుగా పడివున్నాయి. పిఠాపురంకాలనీ రోడ్డులో భారీగా కొమ్మలు పోగు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

అదే రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్థంభాన్ని తొలిగించలేదు. దీనికి తోడు చెట్టు కొమ్మలు పోగులపై చెత్తచెదారాలు విసిరేయడంతో అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. అధికారులు స్పదించి చెట్ల పోగులను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సహకారంతో అందమైన విశాఖ

- ఎమ్మెల్యే వెలగపూడి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరవాసుల సహకారంతో అందమైన విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025 కార్యక్రమంలో భాగంగా 18వ వార్డు పరిధిలోని శివగణేష్ నగర్‌లో జీవీఎంసి పారిశుధ్య సిబ్బంది, స్థానికులతో కలసి పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని మొక్కలు నాటారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్, జోన్-3 కమిషనర్ శివప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు గొలగాని పోలారావు, కారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై షర్మిల విమర్శలు అర్ధరహితం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్కాములే తప్ప సంక్షేమ పథకాల స్కీములేవని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు లేదన్నారు. మంగళవారం ఆయన వీఎంఆర్డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లలో గిరిజన వసతిగృహాల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేయడం వల్లే ఇప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంపై ఏమాత్రం అవగాహన లేకుండా వైఎస్ షర్మిల నోటికొచ్చినట్టు మాట్లాడటం సరైనది కాదన్నారు. మాజీ సీఎం, ఆమె అన్న జగన్ మోహన్ రెడ్డి ఏపీకి విజిటింగ్ గెస్ట్‌గా, చెల్లి షర్మిల విశాఖకు టూరిస్ట్‌గా వచ్చిపోతూ.. ఇలా ప్రచారాల కోసం ఆరాటపడుతున్నట్టుగా అనిపిస్తోందని విమర్శించారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల విద్యార్థుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు అన్ని రకాలుగా మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.



విద్యార్థుల చేతుల్లోనే ప్లాస్టిక్ రహిత సమాజం

- వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల చేతుల్లోనే ప్లాస్టిక్ రహిత సమాజం ఉందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు కళాశాలలో మంగళవారం వృక్ష శాస్త్ర విభాగం, హరితకృష్ణ ఎకో క్లబ్, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ అవగాహనలో ఆయన మాట్లాడారు. సమాజానికి ప్లాస్టిక్ పెనుభూతంలా పీడిస్తోందన్నారు. మానవుని జీవనంలో భాగమైన ప్లాస్టిక్‌ను విడనాడాలంటే విద్యార్థులు నడుం బిగించాలన్నారు. ఇప్పటి నుంచే ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి ఇతరులకు ప్లాస్టిక్ వల్ల ఏర్పడే అనర్థాలు వివరిస్తే భవిష్యత్‌లో ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.పద్మావతి, డి.పుష్పలత, పి.స్వామినాయుడు, సుజాత, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'లోక కల్యాణ్' ప్రయోజనాలను వీధి విక్రయదారులు సద్వినియోగపరచుకోవాలి

- జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి



వెంకోజీపాలెం, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లోక్ కల్యాణ్ (పీఎం స్వానిధి 2.0) ప్రయోజనాలను వీధి విక్రయదారులు సద్వినియోగపరచుకోవాలని జీవీఎంసీ యసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి ఒక ప్రకటన ద్వారా కోరారు. వీధి విక్రయదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వారికి స్వేచ్ఛగా గౌరవప్రదమైన వ్యాపారం నిర్వహించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 రుణాలు, డిజిటల్ లావాదేవీలపై లబ్ధి, క్రెడిట్ కార్డులు, ఎఫ్‌సీ సర్టిఫికెట్లు, సోషియో ఎకానమీ సర్వే, జీఎస్టీ తదితర ప్రయోజనాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అంశాలపై స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులు, వీధి విక్రయదారులకు అవగాహన కల్పించేందుకు నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ నల్మ్ 2.0 ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రయోజకత్వంతో లోక్ కల్యాణ్ మేళాను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే పీఎం స్వానిధి రుణాల కింద కొత్త, పెండింగ్‌లో ఉన్న వీధి వ్యాపారులకు అవగాహన కల్పించి రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

మొదటి విడత - రూ.15,000 (మునుపు -రూ.10,000)

రెండవ విడత - రూ.25,000 (మునుపు రూ.20,000)

మూడవ విడత - రూ.50,000 (ఏ మార్పు లేదు) రుణాల విడతలను ప్రకటన ద్వారా తెలిపారు. సామాజిక, ఆర్థిక ప్రొఫైలింగ్ సర్వే ద్వారా అన్ని రకాల వీధి వ్యాపారులను గుర్తించి నమోదు చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద కవరేజ్ కల్పించడం, పీఎం జనదన్ యోజన, పీఎం సురక్షా యోజన, వన్ ఫ్యామిలీ - వన్ నేషన్, పీఎం జీవన్‌జ్యోతి తదితర క్రెడిట్ కార్డుల ప్రోత్సాహం ద్వారా మూడో విడత రుణాలకు అర్హత కలిగిన వ్యాపారులను, ప్రస్తుతం నడుస్తున్న రుణాలను కవర్ చేయడం, అలాగే ప్రతి నెలకు రూ.100, ప్రతి త్రైమాసికానికి రూ.100, సంవత్సరానికి మొత్తం రూ.1600 (నియమిత చెల్లింపులు చేసే వ్యాపారులకు మాత్రమే) డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం కలుగుతుందన్నారు. పీఎం స్వానిధి రుణాలను క్రమబద్ధంగా చెల్లించే వ్యాపారులకు 7 శాతం వడ్డీ సబ్వెన్షన్ దక్కుతుందని, వీధి వ్యాపారులు ఆర్థికంగా బలపడటమే కాకుండా డిజిటల్ లావాదేవీల్లో భాగస్వాములు అవుతూ, వివిధ కేంద్ర పథకాల ప్రయోజనాలను లబ్ధిని పొందే అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపినట్టు యూసీడీ పీడీ సత్యవేణి ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఐతో అద్భుతాలు సృష్టించవచ్చు

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



పాట ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో స్టూడియో అధినేత సునీల్

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సక్రమంగా వినియోగిస్తే ఏఐతో అద్భుతాలు సృష్టించొచ్చని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించడం ద్వారా పాటకు అవసరమైన గేయ రచన, సంగీతం, గానంతో రూపొందించిన హిందీ పాటను ఎమ్మెల్యే తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. 9వి ఎఫెక్ట్స్ సినీ స్టూడియో అధినేత అడ్డూరి సునీల్ చరణ్ రూపొందించిన పాటను విడుదల చేశారు. సినీ పరిశ్రమకు ఏఐ టెక్నాలజీ కొత్త ట్రెండ్ సృష్టించగలదని ఎమ్మెల్యే అన్నారు. సునీల్ మరింతగా కృషి చేసి, సినీ పరిశ్రమకు కొత్త సొబగులు అద్దాలని ఆకాంక్షించారు. ఈ సాంకేతికతను వినియోగించిన మొదటి వ్యక్తి విశాఖ యువకుడు కావడం అభినందనీయమన్నారు. చిత్రీకరణకు నిర్మాతగా ముందుకు వచ్చిన జె.శ్రీనివాస్, గంటా రవితేజ, క్రీడా జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్, ఆయుర్వేద వైద్యులు కోడిగుడ్ల సురేష్, సీనియర్ జర్నలిస్టు బీఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ)కమిటీ నూతన చైర్మన్‌గా ఎంకేవీఎల్ నరసింహారావు ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ చాప్టర్ వైస్ చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్ పీఆర్వో బంగారు రాజు, కార్యదర్శిగా గోవిందరావు, కోశాధికారిగా నరసింహం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసకుమార్, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ నరసింహం మాట్లాడుతూ తమ బృందం రాబోయే రెండేళ్లలో జాతీయ, రాష్ట్ర స్థాయి సెమినార్లు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు.

జీవీఎంసీలో వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకుంటున్న జీవీఎంసీ ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధ మహాకవి వాల్మీకి అని, ఆదికవిగా, మహా జ్ఞానిగా, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రాసిన మహనీయుడిగా, మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుక కార్యక్రమాలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీసీలు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులుతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామాయణాన్ని రాయడం ద్వారా గొప్ప ఇతిహాసాన్ని వాల్మీకి ప్రపంచానికి అందజేశారని స్మరించుకున్నారు. ప్రపంచంలో అందరూ రామాయణ గ్రంథాన్ని వాల్మీకి రామాయణంగా పిలుచుకుంటారని గుర్తు చేస్తూ వాల్మీకి జీవిత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫైనాన్సింగ్ అడ్వైజర్ మల్లికాంబ, పరిపాలన విభాగాధికారి అప్పలనాయుడు, పర్యవేక్షకులు శ్రీనివాస్, రియాజ్, జీవీఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 13న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

భీమునిపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్ సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యురాలు ఆకుల భవానీ కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈనెల 13న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లు, జిల్లా ఆస్పత్రులు, రెవెన్యూ కార్యాలయాల ముందు ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

గాజాలో మారణహోమంపై ఆందోళన



ఆందోళన చేపట్టిన పౌర చైతన్య వేదిక నేతలు, సభ్యులు

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గాజాలో ఇజ్రాయెల్ నిర్వహిస్తొన్న మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెన్ను చాంద్ మాట్లాడుతూ గాజాలో జరుగుతున్న మారణహోమం అందరినీ కలిచివేస్తొందన్నారు. అమెరికా అండతో మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్ పాల్పడుతున్న దురాగతాలను ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ అదానీ కంపెనీ, మరికొంతమంది ఎల్బిట్ కంపెనీతో రక్షణ ఒప్పందం చే సుకొని యుద్ధానికి పరోక్షం గా సహకరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వే దిక నాయకులు ప్రమీల, గోవిందరాజు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి జోనల్ కార్యాలయానికి స్వచ్ఛ గ్రీన్ అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న జడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్ వన్ భీమిలి జోనల్ కార్యాయానికి ఉత్తమ స్వచ్ఛంధ్రా గ్రీన్ అవార్డుకు ఎంపికైనట్టు జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా సోమవారం నగరంలోని ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో జడ్సీ అయ్యప్పనాయుడు స్వచ్ఛ గ్రీన్ అవార్డును అందుకున్నారు. కార్యాలయం లోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో ఈ అవార్డు ప్రభుత్వం ప్రకటించిందని ఆయన తెలిపారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య : సీపీఐ



గాంధీజీ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

సిరిపురం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాది రాకేష్ కిశోర్ కోర్టు హాలులో దాడి యత్నాన్ని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో దేశ ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేసేందుకు ప్రయత్నించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజల మధ్యమత విద్వేషాలను రెచ్చగొట్టేలా జరిగిన ఈ ఘటనలో కుట్రకోణం దాగి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.దీనిపై కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మన్మథరావు, నాగభూషణరావు, బేగం, పుష్పలత, కాసుబాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చడమే కూటమి అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నూకరాజు

భీమునిపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కష్టాలను తీర్చడమే అజెండాగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బీచ్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' భాగంగా ఒక్కొక్క ఆటో కార్మికుడికి రూ.15 వేలు అందించడం ఆనందకరమన్నారు. ఎన్నికల హామీలన్నింటిని కూటమి సర్కార్ అమలుచేస్తుందన్నారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు వియ్యపు పోతురాజు, శీరం గురుమూర్తి, వాసుపల్లి కొండ, రేగాని శ్రీనివాసరావు, ఎర్ర రాము, గుడ్డాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆక్రమణల సంగతి చూడరూ?

▸▸ రాజేంద్రనగర్‌లో రహదారిని ఆక్రమించి ఇంటి నిర్మాణం ▸▸ 60 అడుగుల రోడ్డు 20 అడుగులకే పరిమితం
▸▸ ఫుట్‌పాత్ ఆక్రమణతో రాకపోకలకు ఇబ్బందులు ▸▸ ప్రశ్నించినవారిపై దౌర్జన్యం...దుర్భాషలు


సీతంపేట రాజేంద్రనగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న ఇల్లు


ఫుట్‌పాత్ ఆక్రమణ

సీతంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్, బీటీఆర్ కాలనీలో గల 60 అడుగుల రోడ్డుకు అడ్డంగా కొందరు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. దీంతో ఆ రోడ్డు 20 అడుగులకు కుంచించుకుపోయింది. ఇందులో నివసిస్తున్నవారు రోడ్డు పక్కన కాలువలో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది గుంపులుగా ఇళ్లలోకి వస్తున్నాయి. దోమలు కుట్టడంతో స్థానికులు రోగాల బారిన పడి అవస్థలు పడుతున్నారు. సీతంపేట రాజేంద్రనగర్, బీటీఆర్ కాలనీలో వంద ల కుటుంబాలవారు నివాసం ఉంటున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్లు నిర్మించారు. కొందరు కావాలని రాజేంద్రనగర్ రోడ్డును ఆక్రమించి రోడ్డుపైనే పాక, పెంకుటిల్లు నిర్మించుకొని, పెద్ద ఎత్తున డేరాలు వేసి ఉంటున్నారు. వారికి బీటీఆర్ కాలనీలో ఇళ్లు ఉన్నా రోడ్డును ఆక్రమించి ఉంటుండడం గమనార్హం. రోడ్డుపైనే కుర్చీలు, మంచాలు వేసి పడుకుంటున్నారు. దీంతో అటుగా వాహనాల రాకపోకలకు వీలులేకుండా పోతుంది. కార్లు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఓ వైపు వీరు 40 అడుగులు ఆక్రమించి ఉంటే, రోడ్డు పక్కనే గల డివైడర్‌పై కొందరు కోళ్ల గూళ్లు పెట్టి నడవటానికి వీలు లేకుండా చేశారు. పగలు, రాత్రి తేడాలేకుండా మద్యం తాగడం, అటుగా వెళ్లిన వారిపై దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడుతున్నారు.. కొంతమంది ప్లాస్టిక్ చెత్తను ఏరుకొచ్చి డివైడర్‌పై నిల్వ ఉంచి వాటిని కొద్ది రోజుల తర్వాత చెత్త దుకాణంలో అమ్ముతున్నారు. ఇలా స్థానిక ప్రజల జీవితాలతో ఆడుకుంటూ ఆ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నారు. గతంలో జీవీఎంసీ కమిషనర్ పర్యవేక్షణలో జోనల్ కమిషనర్‌గా ఉన్న నల్లన్నయ్య ఆక్రమణలను తొలగించడమే కాకుండా రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. రహదారికి అడ్డంగా నిర్మించిన ఇంటిని తొలగించి, ఫుట్‌పాత్ ఆక్రమించకుండా చూడాలని స్థానిక నివాసితులు కోరుకుంటున్నారు. తమ ఇబ్బందులను పరిశీలించి రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

ఘనంగా అభయ దుర్గాదేవి అమ్మవారి అనుపు ఉత్సవం


తలపై అమ్మవారి ప్రతిమలతో భక్తులు

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల అభయ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శర్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది అవతారాల అమ్మవార్ల ప్రతిమలతో పురవీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తలపై బిందెలతో అమ్మవారి ప్రతిమలను ఊరేగించి అభిషేకాలు నిర్వహించారు. గ్రామదేవత పూజారి పర్యవేక్షణలో అమ్మవార్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఏషియన్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి రిఫరీగా శర్మ



విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ రిఫరీగా ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ డి.రామారావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరి, జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జె.కె.నాయక్, కెవీఎంఎం.పాత్రో తదితరులు హర్షం ప్రకటించారు.

హ్యూమన్ రైట్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రాధాకుమారి



అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి హ్యూమన్ రైట్ సెల్ (హెచ్ఆర్సీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ నియామక పత్రాన్ని ఆమెకు పంపారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన హెచ్ఆర్సీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎం నాయుడు, మంగయ్య నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, సుదర్శన్ పట్నాయక్, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.


బాలల చలన చిత్రోత్సవ నిర్వహణకు హామీ

డాబాగార్డెన్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం, బాలల చలన చిత్రోత్సవం నిర్వహించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను కోరినట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. 1994లో నిర్మించిన వుడా బాలల ప్రాంగణాన్ని బాలల కార్యక్రమాలకు అందుబాటులోకి తేవాలని ఆయనను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

జీఎస్టీపై ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు జీఎస్టీపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి బాలామణి పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు మంగళవారం సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో గ్రేటర్ 42వ వార్డు సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, జీఎస్టీ కోసం వార్డు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నం వెంకట రమణారావు, ముక్కి రామకృష్ణ, గురుగోవింద్ సింగ్, ఎంఎల్ఎన్ రావు, దువ్వి కాళీప్రసాద్, జేకే తదితరులు పాల్గొన్నారు.

'సీజేఐపై దాడిని ఖండిస్తున్నాం'


సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడికి ప్రయత్నించడాన్ని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ఘటనను రాజ్యాంగ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నామన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్ తమ సొంత రాష్ట్రం మహారాష్ట్ర మొదటిసారి వెళ్లినప్పుడు ప్రొటోకాల్ పాటించాల్సిన చీఫ్ సెక్రటరీ, డీజీపీ హాజరు కాకుండా ఆయనను తీవ్రంగా అవమానపరిచారన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి కూడా పిలవలేదన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తూనే, ఆయన్ని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన దాడి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇది మనువాదుల కుట్ర అని, దళితులకు అవమానంగా భావిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కాంతారావు, ఎస్.రాజులు, అప్పారావు, పడమట్ల గంగరాజు, భైరవ మూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

'మానవాళికి మహత్తర కావ్యం రామాయణం'


వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న ఖజానా శాఖ అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాకవి వాల్మీకి రామాయణాన్ని రచించి మానవాళికి మహత్తర సందేశాన్ని అందించారని జిల్లా ఖజానా అధికారి కె.రామోహనరావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న రెవెన్యూ భవనంలో గల జిల్లా ఖజానా కార్యాలయంలో మహాకవి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకి మహాజ్ఞాని, తాత్వికుడని, సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించారని, నేటికీ మనదేశం దీనిని అనుసరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి కోస్తు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక కొండపై వైభవంగా గౌరీ పౌర్ణమి పూజలు


అలంకరణలో రమా సత్యనారాయణ స్వాములు


సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొండ శ్రీ సత్యదేవుని ఆలయంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం గౌరీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి ఆలయంగా పేరొందిన కేజీహెచ్ వద్ద ఇసుక కొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో పెద్దసంఖ్యలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి, అమ్మవార్లకు పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువ నుంచే భక్తులు విచ్చేసి ఆలయ ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 150 జంటలు వ్రతాలు చేయించుకున్నారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాలరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని సమకూర్చారు.

22 నుంచి కార్తిక మాసోత్సవాలు

ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు అత్యంత వైభవంగా కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. రోజూ ఉదయం 8.30 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపనున్నట్లు తెలిపారు. నవంబరు 1న క్షీరాబ్ది ఏకాదశి, 15న బహుళ ఏకాదశి జరుపనున్నట్లు పేర్కొన్నారు. నవంబరు 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉత్సవం జరగనున్నట్లు వెల్లడించారు.

త్వరలోనే వెంకటేశ్వరమెట్ట భూసమస్యకు పరిష్కారం


నేరెళ్ల కోనేరు వద్ద తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 33వ వార్డు వెంకటేశ్వరమెట్టలో వందేళ్లుగా ఉన్న దేవదాయ శాఖ భూ సమస్యను రెండు నెలల్లో పరిష్కరించనున్నట్లు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇటీవల అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో వెంకటేశ్వరమెట్ట భూ సమస్య కారణంగా ఇళ్లకు మరమ్మతులు చేసుకునే అవకాశం కానీ, బ్యాంకు రుణాలు పొందే అవకాశం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్యేను తెలుగుదేశం పార్టీ 33వ వార్డు నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వరమెట్టలో ఉన్న నివాసితులు ఘనంగా సత్కరించారు. సంఘం సభ్యులు భీశెట్టి శ్రీను, శరగడం మోహన రావు, కోరిబిల్లి దేవరాజు పాల్గొన్నారు.

వర్తకులకు తోపుడు బండ్ల పంపిణీ

అల్లిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిల్లర వర్తకులకు వ్యాపారం నిమిత్తం 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు ఉచితంగా తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జీవీఎంసీ అధికారుల చర్యల వలన అనేక మంది చిల్లర వర్తకులు వీధిన పడ్డారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉండేలా చర్యలు చేపడుతుందన్నారు. వారి సమస్యలను గుర్తించిన కార్పొరేటర్ నాగరాజు తోపుడు బండ్లను సమకూర్చడం ఆనందదాయకమన్నారు. కందుల బద్రీనాథ్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో చెట్టుకొమ్మల తొలగింపు


వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 14, 24 వార్డులలో రోడ్డుపై ఉన్న చెట్టు కొమ్మలను, చెత్తను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. గురుద్వార కూడలిలోని గురునానక్ మార్గ్‌లో గాలివానకు విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగించి ఉంచారు. వాటిని జేసీబీ సాయంతో జీవీఎంసీ సూపర్‌వైజర్ రమణ, ఇతర సిబ్బంది తొలగించారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

▸▸ వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


కేజీహెచ్‌లో బాలికలను పరామర్శిస్తున్న ప్రణవ్ గోపాల్

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పరామర్శించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌కు వెళ్లి విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారని, పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ పాలనలో సంక్షేమ వసతిగృహాలలో కనీస సదుపాయాలు కల్పించలేదని, నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు ఈ పరిస్థితి నెలకొందని ప్రణవ్ గోపాల్ ఆరోపించారు. పిల్లల బాగోగులు పట్టించుకోని వైసీపీ నాయకులకు నేడు మాట్లాడే అర్హత లేదన్నారు. టీడీపీ నాయకులు రతన్‌కాంత్, ఆర్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

▸▸ ప్రభుత్వ విప్ గణబాబు


సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

సీతంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, అభ్యున్నతికి కట్టుబడి ఉందని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను వివిధ దేవాలయాలలో ట్రస్టీలుగా నియమించడం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గ్రేడ్‌వన్ దేవాలయాల్లో తలనీలాల రేట్లు పెంచడం, ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా దేవగుప్త రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఆతవ సుబ్బారావు, కోశాధికారిగా వీరేశ్వరపు త్రినాథ్‌లను ఎన్నుకున్నారు. వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆరిపాక పెంటారావు, పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జిలు మాట్లాడుతూ టీడీపీ ఎప్పుడూ నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేత మంత్రి రాజశేఖర్, కోటా నరేష్, పుల్లేటికుర్తి రమేష్, తమ్మిని విజయకుమార్, అనసూరి మధు, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల వద్ద లడాయి

▸▸ సరుకులు అందక కార్డుదారులు గగ్గోలు ▸▸ డీలర్లతో వాగ్వాదం


రేషన్ సరుకుల కోసం పడిగాపులు

మురళీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల దసరా, దీపావళి పండుగ సీజన్‌లోనే రేషన్ డిపోలకు గోడౌన్ల నుంచి సరుకులు చేరలేదు. డిపోల్లో కార్డుదారులకు ఇచ్చేందుకు సరుకులు లేవు. ప్రతి నెలా ఇస్తున్న బియ్యం, పంచదార 50 శాతం కూడా చేరలేదు. సర్కిల్ 1 పరిధిలోని మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌లోనే ఆలస్యం కావడంతో డిపోల్లో డీలర్లు ఖాళీగా ఉన్నారు. సర్కిల్ 1 పరిధిలోని మాధవధార, కైలాసపురం, మర్రిపాలెం ప్రాంతాలు అక్టోబరు 1న ఆరంభమైనా ఈ అరకొర రేషన్ 4వ తేదీకేపూర్తయ్యింది. దీంతో విషయం తెలియని కార్డుదారులు డిపోలకు వెళ్లి ఉసూరుమని తిరిగి ఇళ్లకు చేరుతున్నారు. చాలా చోట్ల రేషన్ డీలర్లకు, కార్డుదారులకు మధ్య గొడవలు తలెత్తుతున్నాయి. 4వ తేదీకే రేషన్ అయిపోవడం ఏంటి? అనే ప్రశ్నకు డీలర్లు చెబుతున్న సమాధానం పట్ల కార్డుదారులు సంతృప్తి చెందక సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం డిపోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కార్డుదారులు సరుకుల కోసం వేచి ఉంటున్నారు. గోడౌన్ల నుంచి ఎప్పుడు డిపోలకు సరుకులు చేరతాయన్న విషయమై చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, సివిల్ సప్లయిస్ శాఖ ఏఎస్‌ఓ స్థాయి అధికారులకు కూడా స్పష్టత లేదు. ఈ కారణంగా ఫలానా తేదీన డిపోలకు రండి అని కార్డుదారులకు చెప్పలేని స్థితిలో ఉన్నారు. జిల్లా అధికారులు ఈ విషయమై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు. పంపిణీ ఏ తేదీ వరకు ఉంటుందో తెలియని తికమక పరిస్థితులను సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నివాసిత ప్రాంతాల్లో చిమ్మచీకట్లు


మాధవధార ఉడాకాలనీలో వెలుతురు లేని వీధి

మాధవధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్ ప్రధాన రహదారి, శ్రీనివాసనగర్ నివాసిత ప్రాంతాలు దాటి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ వెలుగులు లేక చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. దీనితో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50వ వార్డు మురళీనగర్ బ్యాంక్ స్ట్రీట్, రామాలయం రోడ్డు సహా 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ ఆర్టీఏ కార్యాలయం మెయిన్ రోడ్డు నుంచి ఉడా కమ్యూనిటీ హాలు ఎల్ఐజీ నివాసిత ప్రాంతాల్లోనూ వాహనాల వెలుగుల్లోనే స్థానికులు అతికష్టంపై రాకపోకలు సాగిస్తున్నారు. కొండ సమీప ప్రాంతాల్లో చీకటిదారుల్లో నడవడానికే ఈ ప్రాంతాల నివాసితులు భయపడుతున్నారు. జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందించాలని కోరుతున్నారు. దసరా రోజు కురిసిన గాలి వాన నుంచే ఈ ప్రాంతాల్లోని వీధులు చీకటిమయంగా మారాయి.

లోన్ యాప్‌లతో జాగ్రత్త

... 5వ పేజీ తరువాయి

సంబంధించి నగరంలో ఇప్పటివరకూ 317 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని క్రిప్టో కరెన్సీని సీజ్ చేశామన్నారు. దీనిపై న్యాయపరమైన సంప్రతింపులు జరిపి, వివిధ ప్రక్రియలను పూర్తిచేసిన తర్వాత సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చామన్నారు. మొదటి దశలో రూ.48,59,072ను వంద మంది బాధితులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అందజేశామన్నారు. రెండో దశలో భాగంగా 26 మందికి మంగళవారం రూ.7,20,647 అందజేస్తున్నామన్నారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్ మోసాలకు సంబంధించిన కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయని, నగరవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఎవరైనా సైబర్ మోసాలకుగానీ, ఇతర మోసాలకుగానీ గురైతే 7995095799 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వీలైనంత వేగంగా వివరించగలిగితే ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా నిలుపుదల చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బాధితులకు రికవరీ చేసిన మొత్తాన్ని సీపీ అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ ఫల్గుణరావు, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు

... 5వ పేజీ తరువాయి

ఫీజుల రూపంలో వర్సిటీకి చెల్లిస్తుంటాయి. లైబ్రరీ ఫండ్, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజు, కల్చరల్, కరిక్యులమ్, అఫ్లియేషన్ వంటి ఫీజులు ఉంటాయి. ఇవన్నీ చెల్లించిన కాలేజీలకు యూనివర్సిటీ అధికారులు నో డ్యూ సర్టిఫికెట్‌ను ఇస్తుంటారు. నో డ్యూ సర్టిఫికెట్‌ను కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) ఇస్తుంది. అయితే, కొన్నిరకాల కారణాలతో అనేక కాలేజీలు కొన్ని ఫీజులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నాయి. దీంతో వర్సిటీ అధికారులు ఆయా కాలేజీలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. ఇది విద్యార్థులకు ఇబ్బందిగా మారుతోంది.

డ్రాప్ అయిన విద్యార్థులు ఫీజు

ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్స్ ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే రెండో విడత అడ్మిషన్స్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. ఇక్కడ ఒక సమస్య డిగ్రీ కాలేజీలను వేధిస్తోంది. సాధారణంగా కాలేజీల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ఆయా కాలేజీలు యూనివర్సిటీకి చెల్లించడం పరిపాటి. అయితే, ఏయూ అధికారులు అందుకు భిన్నంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులందరి ఫీజులను కాలేజీ యాజమాన్యాలే చెల్లించాలని కోరుతున్నాయి. అదే ఇప్పుడు యాజమాన్యాలకు ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు నగర పరిధిలోని ఒక డిగ్రీ కాలేజీలో చేరేందుకు 150 మంది విద్యార్థులు ఆసక్తి చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, వారిలో చాలామంది రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీల్లో కాకుండా ఇతర కాలేజీల్లో చేరిపోయారు. అయితే, చేరిన కాలేజీల నుంచి కాకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీలు ఫీజులు చెల్లించాలని ఏయూ అధికారులు కోరుతున్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు వేయి రూపాయలు వరకు చెల్లించాల్సి రావడంతో కాలేజీలకు భారంగా మారుతోందని చెబుతున్నారు.

అంబుజాకు అడ్డగోలుగా భూములు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుపై అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. తాము పెట్టబోయే పరిశ్రమ 'బి' కేటగిరీకి చెందినదని, ఆరెంజ్ విభాగంలోకి వస్తుందని, దాంతో కాలుష్యం ఉండదని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పేర్కొంది. ఇది శుద్ధ అబద్ధమని ప్రజా శాస్త్రవేత్తల బృందం మంగళవారం తమ లేఖలో కుండబద్దలు కొట్టింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమండల్ వంటి రెడ్ కేటగిరీ పరిశ్రమలన్నీ అక్కడే ఉన్నాయని, వాటి మధ్యలో పెట్టే 'అంబుజా సిమెంట్' పరిశ్రమ 'బి' కేటగిరీలోకి రాదని, ఆరెంజ్ విభాగానికి ఎలా చెందుతుందని ప్రశ్నించారు. గంజాయి వనంలో ఉంటూ తులసి మొక్క అంటే ఎలా అని నిలదీశారు. దీనివల్ల తీర ప్రాంత జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, ఈ విషయాన్ని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో తొక్కి పెట్టారని ఆరోపించింది.

ట్రాఫిక్ అంశాలే లేవు

అదానీ సమర్పించిన నివేదికలో సిమెంట్ పరిశ్రమ వల్ల ఏర్పడే ట్రాఫిక్ గురించి అసలు ప్రస్తావనే లేదని, ఇది చాలా కీలకమని శాస్త్రవేత్త బాబూరావు అన్నారు. ఉత్పత్తి చేసిన సిమెంట్ మొత్తం నౌకల ద్వారా రవాణా చేయరని, తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం, సిమెంట్ ఉత్పత్తిని ఇతర ప్రాంతాలకు పంపడానికి రోజుకు కనీసం 500 భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణం చేస్తాయని పేర్కొన్నారు. ఆ రద్దీని తట్టుకొనే రహదారులు, వ్యవస్థ ఏమీ లేవని, దాంతో వాటిని నివేదికలో పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. లారీల పార్కింగ్, వీల్ వాషింగ్, టార్పాలిన్ కప్పి సరకు రవాణా వంటి అంశాలపై ప్రణాళికే లేదన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల పెదగంట్యాడ-గాజువాక మార్గంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

ఇవేమీ లేవు

పర్యావరణ ప్రభావ అంచనా నివేదిలో లాజిస్టిక్ ప్లాన్, ట్రాఫిక్ ప్రభావం, రవాణా కాలుష్యం, రైలు, షిప్ నెట్‌వర్క్, కన్వేయర్ విధానం, రహదారుల పక్కన కాలుష్యం కొలిచే పరికరాల వంటి అంశాలు ఏవీ ప్రస్తావించలేదని, నామమాత్రంగా తప్పుడు నివేదిక సమర్పించారని, దీనిని అధికారులు పరిగణనలోకి తీసుకోకూడదని ప్రజాశాస్త్రవేత్తల బృందం డిమాండ్ చేసింది.

అంధకారంలో ఎంవీపీ డబుల్ రోడ్డు



డబుల్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో అంధకారం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు అంధకారంలో ఉంది. జాతీయ రహదారి ఐసీఐసీఐ కూడలి నుంచి బీచ్ రోడ్డును కలిపే డబుల్ రోడ్డులో నిత్యం రద్దీగా ఉంటుంది. టీటీడీ కూడలి, టాస్క్‌ఫోర్స్ కూడలి సర్కిళ్లను అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంతానికి కొత్త అందాలు వచ్చినా, ఇటూ అటూ ఉన్న రహదారిలో చీకట్లు అలముకోవడంతోవాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేయడంతోనే సరిపోదని, విద్యుత్తు దీపాల నిర్వహణ కూడా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

'పార్కు నిర్వహణ వదిలేశాం'

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీనివాస ఉద్యానవనం నిర్వహణను తాము చూడటం లేదని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ తెలిపింది.'కళావిహీనంగా శ్రీనివాస ఉద్యానవనం' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కమిటీ వివరణ ఇచ్చింది. ఆలయం ఎదురుగా ఉన్న పార్కును తామే నిర్వహిస్తున్నట్లు బోర్డు ఉన్నప్పటికీ తాము కొన్నేళ్లుగా నిర్వహణ చూడడం లేదని కమిటీ కార్యదర్శి కేవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తాము పార్కు నిర్వహణను చూశామని, హుద్‌హుద్ తర్వాతజీవీఎంసీ సహకారం కొరవడటంతో ఇబ్బంది ఎదురైందని తెలిపారు. తర్వాత కూడా కొన్నాళ్లు నిర్వహించామన్నారు. అనంతరం స్థానికులు పార్కు నిర్వహణ కోసం అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పార్కు వద్ద తాము నిర్వహిస్తున్నట్టు ఉన్న బోర్డునుతొలగిస్తామని చెప్పారు.

18వ వార్డులో అన్నసమారాధన

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధి బీచ్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. శ్రీషిర్డీ సాయి చిల్లర వ్యాపారస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సంబరాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 24, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 24, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 40, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు బ్యాగ్	
రైతుధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



పిఠాపురం కాలనీ రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు నరికి వేసిన పోగులు



పిఠాపురంకాలనీలో తొలగించని విద్యుత్‌స్తంభం, చెట్ల కొమ్మలు

పిఠాపురం కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే..

- తొలగించని పారిశుధ్య సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

మద్దిలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డులో ఈదురుగాలులకు పడిపోయిన చెట్టు కొమ్మలు ఎక్కడవి అక్కడే ఉన్నాయి. రోడ్డుకు అడ్డంగా పడిన కొమ్మలను నరికి పక్కన పోగులు వేశారు. విజయ దశమి రోజున వీచిన గాలులకు వార్డులోని పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. రెండు విద్యుత్ స్తంభాలు నేలమట్టాయి. పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం, మంగాపురంకాలనీ, శివాజీపాలెం, రేసపువానిపాలెం ఏరియాల్లో చెట్టులు, చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో జీవీఎంసీ సిబ్బంది పడిపోయిన చెట్లు, కొమ్మలను నరికి రోడ్డు పక్కన గుట్టలుగా వేశారు. ఆరు రోజులు కావస్తున్న చెట్ల వ్యర్థాలను తొలిగించడం లేదు. దీంతో ఎక్కడికక్కడే పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు గుట్టలుగా పడివున్నాయి. పిఠాపురంకాలనీ రోడ్డులో భారీగా కొమ్మలు పోగు చేయడంతో రాకపోకలకు ఇబ్బందలు కలుగుతున్నాయి.

అదే రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్థంభాన్ని తొలిగించలేదు. దీనికి తోడు చెట్టు కొమ్మలు పోగులపై చెత్తచెదారాలు విసిరేయడంతో అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. అధికారులు స్పదించి చెట్ల పోగులను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సహకారంతో అందమైన విశాఖ

- ఎమ్మెల్యే వెలగపూడి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరవాసుల సహకారంతో అందమైన విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025 కార్యక్రమంలో భాగంగా 18వ వార్డు పరిధిలోని శివగణేష్ నగర్‌లో జీవీఎంసి పారిశుధ్య సిబ్బంది, స్థానికులతో కలసి పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని మొక్కలు నాటారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్, జోన్-3 కమిషనర్ శివప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు గొలగాని పోలారావు, కారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై షర్మిల విమర్శలు అర్ధరహితం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్కాములే తప్ప సంక్షేమ పథకాల స్కీములేవని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు లేదన్నారు. మంగళవారం ఆయన వీఎంఆర్డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లలో గిరిజన వసతిగృహాల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేయడం వల్లే ఇప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంపై ఏ మాత్రం అవగాహన లేకుండా వైఎస్ షర్మిల నోటికొచ్చినట్టు మాట్లాడటం సరైనది కాదన్నారు. మాజీ సీఎం, ఆమె అన్న జగన్ మోహన్ రెడ్డి ఏపీకి విజిటింగ్ గెస్ట్‌గా, చెల్లి షర్మిల విశాఖకు టూరిస్ట్‌గా వచ్చిపోతూ.. ఇలా ప్రచారాల కోసం ఆరాటపడుతున్నట్టుగా అనిపిస్తోందని విమర్శించారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల విద్యార్థుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు అన్ని రకాలుగా మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.



విద్యార్థుల చేతుల్లోనే ప్లాస్టిక్ రహిత సమాజం

- వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల చేతుల్లోనే ప్లాస్టిక్ రహిత సమాజం ఉందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు కళాశాలలో మంగళవారం వృక్ష శాస్త్ర విభాగం, హరితకృష్ణ ఎకో క్లబ్, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ అవగాహనలో ఆయన మాట్లాడారు. సమాజానికి ప్లాస్టిక్ పెనుభూతంలా పీడిస్తోందన్నారు. మానవుని జీవనంలో భాగమైన ప్లాస్టిక్‌ను విడనాడాలంటే విద్యార్థులు నడుం బిగించాలన్నారు. ఇప్పటి నుంచే ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి ఇతరులకు ప్లాస్టిక్ వల్ల ఏర్పడే అనర్థాలు వివరిస్తే భవిష్యత్‌లో ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.పద్మావతి, డి.పుష్పలత, పి.స్వామినాయుడు, సుజాత, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'లోక కల్యాణ్' ప్రయోజనాలను వీధి విక్రయదారులు సద్వినియోగపరచుకోవాలి

- జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి



వెంకోజీపాలెం, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లోక్ కల్యాణ్ (పీఎం స్వానిధి 2.0) ప్రయోజనాలను వీధి విక్రయదారులు సద్వినియోగపరచుకోవాలని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి ఒక ప్రకటన ద్వారా కోరారు. వీధి విక్రయదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వారికి స్వేచ్ఛగా గౌరవప్రదమైన వ్యాపారం నిర్వహించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 రుణాలు, డిజిటల్ లావాదేవీలపై లబ్ధి, క్రెడిట్ కార్డులు, ఎఫ్‌సీ సర్టిఫికెట్లు, సోషియో ఎకానమీ సర్వే, జీఎస్టీ తదితర ప్రయోజనాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అంశాలపై స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులు, వీధి విక్రయదారులకు అవగాహన కల్పించేందుకు నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ నల్మ్ 2.0 ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రయోజకత్వంతో లోక్ కల్యాణ్ మేళాను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే పీఎం స్వానిధి రుణాల కింద కొత్త, పెండింగ్‌లో ఉన్న వీధి వ్యాపారులకు అవగాహన కల్పించి రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

మొదటి విడత - రూ.15,000 (మునుపు -రూ.10,000)

రెండవ విడత - రూ.25,000 (మునుపు రూ.20,000)

మూడవ విడత - రూ.50,000 (ఏ మార్పు లేదు) రుణాల విడతలను ప్రకటన ద్వారా తెలిపారు. సామాజిక, ఆర్థిక ప్రొఫైలింగ్ సర్వే ద్వారా అన్ని రకాల వీధి వ్యాపారులను గుర్తించి నమోదు చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద కవరేజ్ కల్పించడం, పీఎం జనధన్ యోజన, పీఎం సురక్షా యోజన, వన్ ఫ్యామిలీ - వన్ నేషన్, పీఎం జీవన్‌జ్యోతి తదితర క్రెడిట్ కార్డుల ప్రోత్సాహం ద్వారా మూడో విడత రుణాలకు అర్హత కలిగిన వ్యాపారులను, ప్రస్తుతం నడుస్తున్న రుణాలను కవర్ చేయడం, అలాగే ప్రతి నెలకు రూ.100, ప్రతి త్రైమాసికానికి రూ.100, సంవత్సరానికి మొత్తం రూ.1600 (నియమిత చెల్లింపులు చేసే వ్యాపారులకు మాత్రమే) డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం కలుగుతుందన్నారు. పీఎం స్వానిధి రుణాలను క్రమబద్ధంగా చెల్లించే వ్యాపారులకు 7 శాతం వడ్డీ సబ్వెన్షన్ దక్కుతుందని, వీధి వ్యాపారులు ఆర్థికంగా బలపడటమే కాకుండా డిజిటల్ లావాదేవీల్లో భాగస్వాములు అవుతూ, వివిధ కేంద్ర పథకాల ప్రయోజనాలను లబ్ధిని పొందే అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపినట్టు యూసీడీ పీడీ సత్యవేణి ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఐతో అద్భుతాలు సృష్టించవచ్చు

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



పాట ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో స్టూడియో అధినేత సునీల్

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సక్రమంగా వినియోగిస్తే ఏఐతో అద్భుతాలు సృష్టించొచ్చని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించడం ద్వారా పాటకు అవసరమైన గేయ రచన, సంగీతం, గానంతో రూపొందించిన హిందీ పాటను ఎమ్మెల్యే తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. 9వి ఎఫెక్ట్స్ సినీ స్టూడియో అధినేత అడ్డూరి సునీల్ చరణ్ రూపొందించిన పాటను విడుదల చేశారు. సినీ పరిశ్రమకు ఏఐ టెక్నాలజీ కొత్త ట్రెండ్ సృష్టించగలదని ఎమ్మెల్యే అన్నారు. సునీల్ మరింతగా కృషి చేసి, సినీ పరిశ్రమకు కొత్త సొబగులు అద్దాలని ఆకాంక్షించారు. ఈ సాంకేతికతను వినియోగించిన మొదటి వ్యక్తి విశాఖ యువకుడు కావడం అభినందనీయమన్నారు. చిత్రీకరణకు నిర్మాతగా ముందుకు వచ్చిన జె.శ్రీనివాస్, గంటా రవితేజ, క్రీడా జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్, ఆయుర్వేద వైద్యులు కోడిగుడ్ల సురేష్, సీనియర్ జర్నలిస్టు బీఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ)కమిటీ నూతన చైర్మన్‌గా ఎంకేవీఎల్ నరసింహారావు ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ చాప్టర్ వైస్ చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్ పీఆర్వో బంగారు రాజు, కార్యదర్శిగా గోవిందరావు, కోశాధికారిగా నరసింహం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసకుమార్, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ నరసింహం మాట్లాడుతూ తమ బృందం రాబోయే రెండేళ్లలో జాతీయ, రాష్ట్ర స్థాయి సెమినార్లు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు.

జీవీఎంసీలో వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకుంటున్న జీవీఎంసీ ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధ మహాకవి వాల్మీకి అని, ఆదికవిగా, మహా జ్ఞానిగా, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రాసిన మహనీయుడిగా, మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుక కార్యక్రమాలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీసీలు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామాయణాన్ని రాయడం ద్వారా గొప్ప ఇతిహాసాన్ని వాల్మీకి ప్రపంచానికి అందజేశారని స్మరించుకున్నారు. ప్రపంచంలో అందరూ రామాయణ గ్రంథాన్ని వాల్మీకి రామాయణంగా పిలుచుకుంటారని గుర్తు చేస్తూ వాల్మీకి జీవిత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫైనాన్సింగ్ అడ్వైజర్ మల్లికాంబ, పరిపాలన విభాగాధికారి అప్పలనాయుడు, పర్యవేక్షకులు శ్రీనివాస్, రియాజ్, జీవీఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 13న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

భీమునిపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్ సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యురాలు ఆకుల భవానీ కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈనెల 13న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లు, జిల్లా ఆస్పత్రులు, రెవెన్యూ కార్యాలయాల ముందు ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

గాజాలో మారణహోమంపై ఆందోళన



ఆందోళన చేపట్టిన పౌర చైతన్య వేదిక నేతలు, సభ్యులు

సిరిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గాజాలో ఇజ్రాయెల్ నిర్వహిస్తోన్న మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెన్నుచాంద్ మాట్లాడుతూ గాజాలో జరుగుతున్న మారణహోమం అందరినీ కలిచివేస్తోందన్నారు. అమెరికా అండతో మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్ పాల్పడుతున్న దురాగతాలను ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ అదానీ కంపెనీ, మరికొంతమంది ఎల్బిట్ కంపెనీతో రక్షణ ఒప్పందం చేసుకొని యుద్ధానికి పరోక్షంగా సహకరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు ప్రమీల, గోవిందరాజు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి జోనల్ కార్యాలయానికి స్వచ్ఛ గ్రీన్ అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న జడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్ వన్ భీమిలి జోనల్ కార్యాయానికి ఉత్తమ స్వచ్ఛంధ్రా గ్రీన్ అవార్డుకు ఎంపికైనట్టు జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా సోమవారం నగరంలోని ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో జడ్సీ అయ్యప్పనాయుడు స్వచ్ఛ గ్రీన్ అవార్డును అందుకున్నారు. కార్యాలయం లోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో ఈ అవార్డు ప్రభుత్వం ప్రకటించిందని ఆయన తెలిపారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య : సీపీఐ



గాంధీజీ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

సిరిపురం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాది రాకేష్ కిశోర్ కోర్టు హాలులో దాడి యత్నాన్ని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో దేశ ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేసేందుకు ప్రయత్నించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజల మధ్యమత విద్వేషాలను రెచ్చగొట్టేలా జరిగిన ఈ ఘటనలో కుట్రకోణం దాగి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.దీనిపై కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మన్మథరావు, నాగభూషణరావు, బేగం, పుష్పలత, కాసుబాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చడమే కూటమి అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నూకరాజు

భీమునిపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కష్టాలను తీర్చడమే అజెండాగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బీచ్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' భాగంగా ఒక్కొక్క ఆటో కార్మికుడికి రూ.15 వేలు అందించడం ఆనందకరమన్నారు. ఎన్నికల హామీలన్నింటిని కూటమి సర్కార్ అమలుచేస్తుందన్నారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు వియ్యపు పోతురాజు, శీరం గురుమూర్తి, వాసుపల్లి కొండ, రేగాని శ్రీనివాసరావు, ఎర్ర రాము, గుడ్డాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయ దుర్గాదేవి అమ్మవారి అనుపు ఉత్సవం


తలపై అమ్మవారి ప్రతిమలతో భక్తులు

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల అభయ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శర్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది అవతారాల అమ్మవార్ల ప్రతిమలతో పురవీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తలపై బిందెలతో అమ్మవారి ప్రతిమలను ఊరేగించి అభిషేకాలు నిర్వహించారు. గ్రామదేవత పూజారి పర్యవేక్షణలో అమ్మవార్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఏషియన్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి రిఫరీగా శర్మ



విశాఖపట్నం స్పోర్ట్స్ అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ రిఫరీగా ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ డి.రామారావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరి, జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జె.కె.నాయక్, కేవీఎంఎం.పాత్రో తదితరులు హర్షం ప్రకటించారు.

హ్యూమన్ రైట్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రాధాకుమారి



అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి హ్యూమన్ రైట్ సెల్ (హెచ్ఆర్సీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ నియామక పత్రాన్ని ఆమెకు పంపారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన హెచ్ఆర్సీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎం నాయుడు, మంగయ్య నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, సుదర్శన్ పట్నాయక్, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

బాలల చలన చిత్రోత్సవ నిర్వహణకు హామీ

డాబాగార్డెన్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం, బాలల చలన చిత్రోత్సవం నిర్వహించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను కోరినట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. 1994లో నిర్మించిన వుడా బాలల ప్రాంగణాన్ని బాలల కార్యక్రమాలకు అందుబాటులోకి తేవాలని ఆయనను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

జీఎస్టీపై ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు జీఎస్టీపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి బాలామణి పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు మంగళవారం సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో గ్రేటర్ 42వ వార్డు సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, జీఎస్టీ కోసం వార్డు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నం వెంకట రమణారావు, ముక్కి రామకృష్ణ, గురుగోవింద్ సింగ్, ఎంఎల్ఎన్ రావు, దువ్వి కాశీప్రసాద్, జేకే తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆక్రమణల సంగతి చూడరూ?

- రాజేంద్రనగర్‌లో రహదారిని ఆక్రమించి ఇంటి నిర్మాణం
- 60 అడుగుల రోడ్డు 20 అడుగులకే పరిమితం
- ఫుట్‌పాత్ ఆక్రమణతో రాకపోకలకు ఇబ్బందులు
- ప్రశ్నించినవారిపై దౌర్జన్యం...దుర్భాషలు


సీతంపేట రాజేంద్రనగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న ఇల్లు


ఫుట్‌పాత్ ఆక్రమణ

సీతంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్, బీటీఆర్ కాలనీలో గల 60 అడుగుల రోడ్డుకు అడ్డంగా కొందరు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. దీంతో ఆ రోడ్డు 20 అడుగులకు కుంచించుకుపోయింది. ఇందులో నివసిస్తున్నవారు రోడ్డు పక్కన కాలువలో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది గుంపులుగా ఇళ్లలోకి వస్తున్నాయి. దోమలు కుట్టడంతో స్థానికులు రోగాల బారిన పడి అవస్థలు పడుతున్నారు. సీతంపేట రాజేంద్రనగర్, బీటీఆర్ కాలనీలో వందల కుంటుంబాలవారు నివాసం ఉంటున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్లు నిర్మించారు. కొందరు కావాలని రాజేంద్రనగర్ రోడ్డును ఆక్రమించి రోడ్డుపైనే పాక, పెంకుటిల్లు నిర్మించుకొని, పెద్ద ఎత్తున డేరాలు వేసి ఉంటున్నారు. వారికి బీటీఆర్ కాలనీలో ఇళ్లు ఉన్నా రోడ్డును ఆక్రమించి ఉంటుండడం గమనార్హం. రోడ్డుపైనే కుర్చీలు, మంచాలు వేసి పడుకుంటున్నారు. దీంతో అటుగా వాహనాల రాకపోకలకు వీలులేకుండా పోతుంది. కార్లు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఓ వైపు వీరు 40 అడుగులు ఆక్రమించి ఉంటే, రోడ్డు పక్కనే గల డివైడర్‌పై కొందరు కోళ్ల గూళ్లు పెట్టి నడవటానికి వీలు లేకుండా చేశారు. పగలు, రాత్రి తేడాలేకుండా మద్యం తాగడం, అటుగా వెళ్లిన వారిపై దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడుతున్నారు. కొంతమంది ప్లాస్టిక్ చెత్తను ఎరుకొచ్చి డివైడర్‌పై నిల్వ ఉంచి వాటిని కొద్ది రోజుల తర్వాత చెత్త దుకాణంలో అమ్ముతున్నారు. ఇలా స్థానిక ప్రజల జీవితాలతో ఆడుకుంటూ ఆ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నారు. గతంలో జీవీఎంసీ కమిషనర్ పర్యవేక్షణలో జోనల్ కమిషనర్‌గా ఉన్న నల్లన్నయ్య ఆక్రమణలను తొలగించడమే కాకుండా రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. రహదారికి అడ్డంగా నిర్మించిన ఇంటిని తొలగించి, ఫుట్‌పాత్ ఆక్రమించకుండా చూడాలని స్థానిక నివాసితులు కోరుకుంటున్నారు. తమ ఇబ్బందులను పరిశీలించి రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

‘సీజేఐపై దాడిని ఖండిస్తున్నాం’


సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడికి ప్రయత్నించడాన్ని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ఘటనను రాజ్యాంగ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నామన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్ తమ సొంత రాష్ట్రం మహారాష్ట్ర మొదటిసారి వెళ్లినప్పుడు ప్రొటోకాల్ పాటించాల్సిన చీఫ్ సెక్రటరీ, డీజీపీ హాజరు కాకుండా ఆయనను తీవ్రంగా అవమానపరిచారన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి కూడా పిలవలేదన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తూనే, ఆయన్ని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన దాడి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇది మనువాదుల కుట్ర అని, దళితులకు అవమానంగా భావిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కాంతారావు, ఎస్.రాజులు, అప్పారావు, పడమట్ల గంగరాజు, భైరవ మూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

‘మానవాళికి మహత్తర కావ్యం రామాయణం’


వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న ఖజానా శాఖ అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాకవి వాల్మీకి రామాయణాన్ని రచించి మానవాళికి మహత్తర సందేశాన్ని అందించారని జిల్లా ఖజానా అధికారి కె.రామోహనరావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న రెవెన్యూ భవనంలో గల జిల్లా ఖజానా కార్యాలయంలో మహాకవి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకి మహాజ్ఞాని, తాత్వికుడని, సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించారని, నేటికీ మనదేశం దీనిని అనుసరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి కోస్టు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక కొండపై వైభవంగా గౌరీ పౌర్ణమి పూజలు


అలంకరణలో రమా సత్యనారాయణ స్వాములు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొండ శ్రీ సత్యదేవుని ఆలయంలో ఆశ్వియుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం గౌరీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి ఆలయంగా పేరొందిన కేజీహెచ్ వద్ద ఇసుక కొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో పెద్దసంఖ్యలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి, అమ్మవార్లకు పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువ నుంచే భక్తులు విచ్చేసి ఆలయ ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 150 జంటలు వ్రతాలు చేయించుకున్నారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాలరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని సమకూర్చారు.


సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

22 నుంచి కార్తిక మాసోత్సవాలు

ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు అత్యంత వైభవంగా కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. రోజూ ఉదయం 8.30 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపనున్నట్లు తెలిపారు. నవంబరు 1న క్షీరాబ్ధి ఏకాదశి, 15న బహుళ ఏకాదశి జరుపనున్నట్లు పేర్కొన్నారు. నవంబరు 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉత్సవం జరగనున్నట్లు వెల్లడించారు.

త్వరలోనే వెంకటేశ్వరమెట్ట భూసమస్యకు పరిష్కారం



నేరెళ్ల కోనేరు వద్ద తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 33వ వార్డు వెంకటేశ్వరమెట్టలో వందేళ్లుగా ఉన్న దేవదాయ శాఖ భూ సమస్యను రెండు నెలల్లో పరిష్కరించనున్నట్లు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇటీవల అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో వెంకటేశ్వరమెట్ట భూ సమస్య కారణంగా ఇళ్లకు మరమ్మతులు చేసుకునే అవకాశం కానీ, బ్యాంకు రుణాలు పొందే అవకాశం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్యేను తెలుగుదేశం పార్టీ 33వ వార్డు నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వరమెట్టలో ఉన్న నివాసితులు ఘనంగా సత్కరించారు. సంఘం సభ్యులు బీశెట్టి శ్రీను, శరగడం మోహనరావు, కోరిబిల్లి దేవరాజు పాల్గొన్నారు.

వర్తకులకు తోపుడు బండ్ల పంపిణీ

అల్లిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిల్లర వర్తకులకు వ్యాపారం నిమిత్తం 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు ఉచితంగా తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జీవీఎంసీ అధికారుల చర్యల వలన అనేక మంది చిల్లర వర్తకులు వీధిన పడ్డారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉండేలా చర్యలు చేపడుతుందన్నారు. వారి సమస్యలను గుర్తించిన కార్పొరేటర్ నాగరాజు తోపుడు బండ్లను సమకూర్చడం ఆనందదాయకమన్నారు. కందుల బద్రీనాథ్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో చెట్టుకొమ్మల తొలగింపు


వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 14, 24 వార్డులలో రోడ్డుపై ఉన్న చెట్టు కొమ్మలను, చెత్తను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. గురుద్వార కూడలిలోని గురునానక్ మార్గ్‌లో గాలివానకు విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగించి ఉంచారు. వాటిని జేసీబీ సాయంతో జీవీఎంసీ సూపర్‌వైజర్ రమణ, ఇతర సిబ్బంది తొలగించారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


కేజీహెచ్‌లో బాలికలను పరామర్శిస్తున్న ప్రణవ్ గోపాల్

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పరామర్శించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌కు వెళ్లి విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారని, పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ పాలనలో సంక్షేమ వసతిగృహాలలో కనీస సదుపాయాలు కల్పించలేదని, నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు ఈ పరిస్థితి నెలకొందని ప్రణవ్ గోపాల్ ఆరోపించారు. పిల్లల బాగోగులు పట్టించుకోని వైసీపీ నాయకులకు నేడు మాట్లాడే అర్హత లేదన్నారు. టీడీపీ నాయకులు రతన్‌కాంత్, ఆర్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ విప్ గణబాబు


సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

సీతంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, అభ్యున్నతికి కట్టుబడి ఉందని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు పీవీజీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను వివిధ దేవాలయాలలో ట్రస్టీలుగా నియమించడం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గ్రేడ్‌వన్ దేవాలయాల్లో తలనీలాల రేటు పెంచడం, ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా దేవగుప్త రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఆతవ సుబ్బారావు, కోశాధికారిగా వీరేశ్వరపు త్రినాథ్‌లను ఎన్నుకున్నారు. వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆరిపాక పెంటారావు, పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జిలు మాట్లాడుతూ టీడీపీ ఎప్పుడూ నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేత మంత్రి రాజశేఖర్, కోటా నరేష్, పుల్లేటికుర్తి రమేష్, తమ్మిని విజయకుమార్, అనసూరి మధు, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల వద్ద లడాయి

- సరుకులు అందక కార్డుదారులు గగ్గోలు
- డీలర్లతో వాగ్వాదం


రేషన్ సరుకుల కోసం పడిగాపులు

మురళీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల దసరా, దీపావళి పండుగ సీజన్‌లోనే రేషన్ డిపోలకు గోడౌన్ల నుంచి సరుకులు చేరలేదు. డిపోల్లో కార్డుదారులకు ఇచ్చేందుకు సరుకులు లేవు. ప్రతి నెలా ఇస్తున్న బియ్యం, పంచదార 50 శాతం కూడా చేరలేదు. సర్కిల్ 1 పరిధిలోని మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌లోనే ఆలస్యం కావడంతో డిపోల్లో డీలర్లు ఖాళీగా ఉన్నారు. సర్కిల్ 1 పరిధిలోని మాధవధార, కైలాసపురం, మర్రిపాలెం ప్రాంతాలు అక్టోబరు 1న ఆరంభమైనా ఈ అరకొర రేషన్ 4వ తేదీకేపూర్తయ్యింది. దీంతో విషయం తెలియని కార్డుదారులు డిపోలకు వెళ్లి ఉసూరుమని తిరిగి ఇళ్లకు చేరుతున్నారు. చాలా చోట్ల రేషన్ డీలర్లకు, కార్డుదారులకు మధ్య గొడవలు తలెత్తుతున్నాయి. 4వ తేదీకే రేషన్ అయిపోవడం ఏంటి? అనే ప్రశ్నకు డీలర్లు చెబుతున్న సమాధానం పట్ల కార్డుదారులు సంతృప్తి చెందక సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం డిపోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కార్డుదారులు సరుకుల కోసం వేచి ఉంటున్నారు. గోడౌన్ల నుంచి ఎప్పుడు డిపోలకు సరుకులు చేరతాయన్న విషయమై చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, సివిల్ సప్లయిస్ శాఖ ఏఎస్‌ఓ స్థాయి అధికారులకు కూడా స్పష్టత లేదు. ఈ కారణంగా పలానా తేదీన డిపోలకు రండి అని కార్డుదారులకు చెప్పలేని స్థితిలో ఉన్నారు. జిల్లా అధికారులు ఈ విషయమై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు. పంపిణీ ఏ తేదీ వరకు ఉంటుందో తెలియని తికమక పరిస్థితులను సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నివాసిత ప్రాంతాల్లో చిమ్మచీకట్లు


మాధవధార ఉడాకాలనీలో వెలుతురు లేని వీధి

మాధవధార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్ ప్రధాన రహదారి, శ్రీనివాసనగర్ నివాసిత ప్రాంతాలు దాటి సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు మెయిన్‌రోడ్డులో విద్యుత్ వెలుగులు లేక చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. దీనితో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50వ వార్డు మురళీనగర్ బ్యాంక్ స్ట్రీట్, రామాలయం రోడ్డు సహా 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ ఆర్టీఏ కార్యాలయం మెయిన్ రోడ్డు నుంచి ఉడా కమ్యూనిటీ హాలు ఎల్ఐజీ నివాసిత ప్రాంతాల్లోనూ వాహనాల వెలుగుల్లోనే స్థానికులు అతికష్టంపై రాకపోకలు సాగిస్తున్నారు. కొండ సమీప ప్రాంతాల్లో చీకటిదారుల్లో నడవడానికే ఈ ప్రాంతాల నివాసితులు భయపడుతున్నారు. జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందించాలని కోరుతున్నారు. దసరా రోజు కురిసిన గాలి వాన నుంచే ఈ ప్రాంతాల్లోని వీధులు చీకటిమయంగా మారాయి.

లోన్ యాప్‌లతో జాగ్రత్త

... 5వ పేజీ తరువాయి

సంబంధించి నగరంలో ఇప్పటివరకూ 317 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని క్రిప్టో కరెన్సీని సీజ్ చేశామన్నారు. దీనిపై న్యాయపరమైన సంప్రతింపులు జరిపి, వివిధ ప్రక్రియలను పూర్తిచేసిన తర్వాత సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చామన్నారు. మొదటి దశలో రూ.48,59,072ను వంద మంది బాధితులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అందజేశామన్నారు. రెండో దశలో భాగంగా 26 మందికి మంగళవారం రూ.7,20,647 అందజేస్తున్నామన్నారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్ మోసాలకు సంబంధించిన కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయని, నగరవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఎవరైనా సైబర్ మోసాలకుగానీ, ఇతర మోసాలకుగానీ గురైతే 7995095799 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వీలైనంత వేగంగా వివరించగలిగితే ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా నిలుపుదల చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బాధితులకు రికవరీ చేసిన మొత్తాన్ని సీపీ అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ పల్లు జరావు, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు

... 5వ పేజీ తరువాయి

ఫీజుల రూపంలో వర్సిటీకి చెల్లిస్తుంటాయి. లైబ్రరీ ఫండ్, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజు, కల్చరల్, కరిక్యులమ్, అఫ్లియేషన్ వంటి ఫీజులు ఉంటాయి. ఇవన్నీ చెల్లించిన కాలేజీలకు యూనివర్సిటీ అధికారులు నో డ్యూ సర్టిఫికెట్‌ను ఇస్తుంటారు. నో డ్యూ సర్టిఫికెట్‌ను కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) ఇస్తుంది. అయితే, కొన్నిరకాల కారణాలతో అనేక కాలేజీలు కొన్ని ఫీజులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నాయి. దీంతో వర్సిటీ అధికారులు ఆయా కాలేజీలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. ఇది విద్యార్థులకు ఇబ్బందిగా మారుతోంది.

డ్రాప్ అయిన విద్యార్థులు ఫీజు

ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్స్ ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే రెండో విడత అడ్మిషన్స్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. ఇక్కడ ఒక సమస్య డిగ్రీ కాలేజీలను వేధిస్తోంది. సాధారణంగా కాలేజీల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ఆయా కాలేజీలు యూనివర్సిటీకి చెల్లించడం పరిపాటి. అయితే, ఏయూ అధికారులు అందుకు భిన్నంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులందరి ఫీజులను కాలేజీ యాజమాన్యాలే చెల్లించాలని కోరుతున్నాయి. అదే ఇప్పుడు యాజమాన్యాలకు ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు నగర పరిధిలోని ఒక డిగ్రీ కాలేజీలో చేరేందుకు 150 మంది విద్యార్థులు ఆసక్తి చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, వారిలో చాలామంది రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీల్లో కాకుండా ఇతర కాలేజీల్లో చేరిపోయారు. అయితే, చేరిన కాలేజీల నుంచి కాకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాలేజీలు ఫీజులు చెల్లించాలని ఏయూ అధికారులు కోరుతున్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు వేయి రూపాయలు వరకు చెల్లించాల్సి రావడంతో కాలేజీలకు భారంగా మారుతోందని చెబుతున్నారు.

అంబుజాకు అడ్డగోలుగా భూములు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుపై అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. తాము పెట్టబోయే పరిశ్రమ ‘బి’ కేటగిరీకి చెందినదని, ఆరెంజ్ విభాగంలోకి వస్తుందని, దాంతో కాలుష్యం ఉండదని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పేర్కొంది. ఇది శుద్ధ అబద్ధమని ప్రజా శాస్త్రవేత్తల బృందం మంగళవారం తమ లేఖలో కుండబద్ధలు కొట్టింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమండల్ వంటి రెడ్ కేటగిరీ పరిశ్రమలన్నీ అక్కడే ఉన్నాయని, వాటి మధ్యలో పెట్టే ‘అంబుజా సిమెంట్’ పరిశ్రమ ‘బి’ కేటగిరీలోకి రాదని, ఆరెంజ్ విభాగానికి ఎలా చెందుతుందని ప్రశ్నించారు. గంజాయి వనంలో ఉంటూ తులసి మొక్క అంటే ఎలా అని నిలదీశారు. దీనివల్ల తీర ప్రాంత జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, ఈ విషయాన్ని పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో తొక్కి పెట్టారని ఆరోపించింది.

ట్రాఫిక్ అంశాలే లేవు

అదానీ సమర్పించిన నివేదికలో సిమెంట్ పరిశ్రమ వల్ల ఏర్పడే ట్రాఫిక్ గురించి అసలు ప్రస్తావనే లేదని, ఇది చాలా కీలకమని శాస్త్రవేత్త బాబూరావు అన్నారు. ఉత్పత్తి చేసిన సిమెంట్ మొత్తం నౌకల ద్వారా రవాణా చేయరని, తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం, సిమెంట్ ఉత్పత్తిని ఇతర ప్రాంతాలకు పంపడానికి రోజుకు కనీసం 500 భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణం చేస్తాయని పేర్కొన్నారు. ఆ రద్దీని తట్టుకొనే రహదారులు, వ్యవస్థ ఏమీ లేవని, దాంతో వాటిని నివేదికలో పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. లారీల పార్కింగ్, వీల్ వాషింగ్, టార్పాలిన్ కప్పి సరకు రవాణా వంటి అంశాలపై ప్రణాళికే లేదన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల పెదగంట్యాడ-గాజువాక మార్గంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

ఇవేమీ లేవు

పర్యావరణ ప్రభావ అంచనా నివేదిలో లాజిస్టిక్ ప్లాన్, ట్రాఫిక్ ప్రభావం, రవాణా కాలుష్యం, రైలు, షిప్ నెట్‌వర్క్, కన్వేయర్ విధానం, రహదారుల పక్కన కాలుష్యం కొలిచే పరికరాల వంటి అంశాలు ఏవీ ప్రస్తావించలేదని, నామమాత్రంగా తప్పుడు నివేదిక సమర్పించారని, దీనిని అధికారులు పరిగణనలోకి తీసుకోకూడదని ప్రజాశాస్త్రవేత్తల బృందం డిమాండ్ చేసింది.

అంబుజా సిమెంట్ పరిశ్రమతో పర్యావరణానికి ప్రమాదం

» ప్రజారోగ్య వేదిక

గాజువాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని, దీని వల్ల ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి పెను ప్రమాదంగా మారుతుందని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రామణయ్య, ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు సృష్టించే సంస్థలకు అనుమతి ఇవ్వవద్దన్నారు. పెదగంట్యాడలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వరాదని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

ప్రజాభిప్రాయాన్ని గౌరవించండి



అంబుజా సిమెంట్ గ్రేడింగ్ కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి. గతంలో పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులను తొలగించి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నారు. పోర్టులో రూ. 7వేల కోట్ల ప్రభుత్వ వాటాను కేవలం రూ.6 వందల కోట్లకు వైసీపీ ప్రభుత్వం అదానీకి దారాదత్తం చేసింది. ఇప్పుడు వైసీపీ పాలకులు ద్వంద వైఖరి అవలంబిస్తుంది. ప్రజల గౌరవాన్ని అధికారులు గౌరవించాలి.

- ప్రసాదుల శ్రీనివాస్
ఏపీఐఐసీ డైరెక్టర్

బొర్రమాంబకు పూజలు



బొర్రమాంబ

అగనంపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆటోనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాస నగర్, ఎర్రగడ్డ కాలని, శ్రామిక నగర్ గ్రామాల ప్రజల కొంగు బంగారమైన శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రాంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఆరవిల్లి కృష్ణశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు, పుట్ట బంగారం తేవడం, వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమా గైడ్

● **కాంతార2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
● **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 24, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 24, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 40, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సీజేఐ పై దాడి అమానుషం!



స్టీల్‌ప్లాంట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు



ఎన్ఏడీ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘం నాయకులు

» ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు చోటులేదన్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులు

» దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీజేఐపై దాడి యత్నం సరికాదని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలకు చోటు లేదని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య అన్నారు. సీజేఐపై దాడిని వ్యతిరేకిస్తూ మంగళవారం ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది సీజేఐపై జరిగిన దాడి కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అని అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్వార్థం కోసం ఇటువంటి దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి

ఎన్.ఎ.డి.జంక్షన్, (ఆంధ్రజ్యోతి): సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై న్యాయవాది దాడి సంఘటనపై దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఎన్ఏడీ వంతెన వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటికీ దళితుల పట్ల జరుగుతున్న అమానుష సంఘటనలు భారత రాజ్యాంగంపై దాడిగానే చూడాలని పేర్కొన్నారు. సీజేఐ పదవిలో ఉన్న వ్యక్తిపై ఈ విధంగా దాడికి యత్నించడం తగదన్నారు. దాడికి పాల్పడిన లాయర్ రాకేశ్ కిశోర్‌ను అరెస్టు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాజు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలి

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్‌కిశోర్ దాడి అమానుషమని ఆరోపిస్తూ పెందుర్తి బీఆర్ అంబేడ్కర్ సేవా సమితీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు బోనాల యేసు జోసఫ్, ప్రధాన కార్యదర్శి తోట సుబ్బారాయుడు మాట్లాడుతూ దాడికి పాల్పడిన న్యాయవాదిపై తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

» వాల్తేరు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పూజాసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న పూజాసింగ్

కూర్మన్నపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని వాల్తేరు రైల్వే డివిజినల్ కమర్షియల్ మేనేజర్ పూజా సింగ్ అన్నారు. మంగళవారం దువ్వాడ రైల్వే స్టేషన్‌ను ఆమె సందర్శించారు. అనంతరం అమృత భారత్ పథకం కింద స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. 5.0 అభివృద్ధి నేషనల్ ఫౌండేషన్ అమృత్ సంవాద్ రైల్వే సెంటర్ నేషనల్ గోల్డ్ జర్నీ సమావేశాన్ని దువ్వాడ రైల్వే స్టేషన్ వీజీపీ లాంచ్‌లో నిర్వహించి ఆమె మాట్లాడుతూ నగరంలో దువ్వాడ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో రూపు దిద్దుకోన్ను విధానాలను, భవిష్యత్తులో ప్రణాళికను, కల్పించే వసతుల గురించి వివరించారు. దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన పూజా సింగ్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్ ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ సభ్యులు వి.జాషువా, వీరరాజు, కామేశ్వరరావు, విజయ కుమార్, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షురాలికి స్వాగతం



షర్మిలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

గోపాలపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కురుపాం బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శించడానికి నగారికి వచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం 12.15 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకుని, రోడ్డు మార్గంలో నగరానికి వెళ్లారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తి

» 350 మంది పోలీసులతో బందోబస్తు

గాజువాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ దగ్గర నెలిముక్కు ఉక్కు నిర్వాసిత క్రీడా మైదానంలో బుధవారం జరగనున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రజాభిప్రాయ సేకరణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రజలకు భారీగా రానున్న క్రమంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెందుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డు చిన ముషిడివాడ రైల్వేవిహార్‌లో మంగళవారం జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్డుకు వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విన్నకోట రాము, సెక్రటరీ కిశోర్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ వైస్ చైర్మన్‌గా బంగార్రాజు



కె.బంగార్రాజును అభినందిస్తున్న దృశ్యం

వేపగుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం చార్టర్ పబ్లిక్ రిలేషన్స్ సోసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) వైస్‌చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్‌లో పీఆర్‌వోగా పనిచేస్తున్న కె.బంగార్రాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవిని కేటాయించిన చార్టర్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పీఆర్ఎస్ఐ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సూచించారు. 2025-2027కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా హెచ్‌పీసీఎల్‌కు చెందిన ఎమ్‌కేఎల్ఎన్ నరసింహమూర్తి, కార్యదర్శిగా నరసింహం (గీతమ్ యూనివర్సిటీ) ఇతర కార్యవర్గ సభ్యులుగా ఆర్‌పీశర్మ, ఏ.గోవిందరావు, నాగేశ్వరరావు, వై.శ్రీనివాసరావు తదితరుల ఎంపికయ్యారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



జీఎస్టీపై డ్వాక్రా సంఘం మహిళలకు అవగాహన కల్పిస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం,అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం చేకూరిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87 వార్డు శెట్టి బలిజ వీధిలో మంగళవారం 'సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలతో కలసి పలు కాలనీల్లో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం సూపర్ జీఎస్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ శ్లాబులను 4 నుంచి 2 వరకు తగ్గిండం శుభపరిణామమన్నారు. దీని ద్వారా నిత్యావసర ధరలు ఎలా ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, మాటూరి రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

88వ వార్డులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కూర్మన్నపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు అన్నారు. 88వ వార్డులో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్య, ఉపాధి, క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తోందని అన్నారు. అనంతరం క్రీడాకారులకు కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో దళిత నాయకుడు మృతి



ఆనంద్‌కుమార్(ఫైల్)

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ ఫ్లైఓవర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన అనంతరం గోపాలపట్నానికి చెందిన చెందిన దళిత నాయకుడు డెంకాడ ఆనంద్ కుమార్ (62) తిరిగి వెళుతూ అక్కడే గుండెపోటుతో కిందపడిపోయాడు. దీంతో అక్కడ దళితనాయకులు వెంటనే ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృదేవాన్ని ఆనంద్ కుమార్ స్వగృహానికి తరలించారు. డెంకాడ ఆనంద్‌కుమార్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ కార్మిక నాయకుడిగా నగరంలో గుర్తింపు పొందారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్మిక ఉద్యమాల్లో, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా ప్రజల పక్షాన పోరాడేవారు. ఆయన మృతి పట్ల పలువురు కార్మిక సంఘాల నాయకులు, స్థానిక నాయకులు నివాళులు అర్పించారు.

చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెం కృషమహంతి చెరువుకు ఆనుకుని ఉన్న కళాశాల యాజమాన్యం కాలువను ఆక్రమించి నిర్మాణాలను చేపట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గాజువాక తహశీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శీలానగర్‌కు చెందిన ఓ కళాశాల నాతయ్యపాలెం చెరువుకు ఆనుకుని ఉన్న స్థలంలో ఆక్రమణ జరుగుతున్నదని వివరించారు. దీనిపై గతంలో రెవెన్యూ అధికారులు కళాశాల యాజమాన్యానికి హెచ్చరించినా వైఖరిలో మాత్రం మార్పురాలేదు. దీనిపై పరిశీలన చేసి చెరువు స్థలాన్ని కాపాడాలని కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు సంద్రాన భాస్కర్, గోపిశెట్టి ఆదినారాయణ, గవర వెంకటరమణ, గండ్రెడ్డి రామునాయుడు, బి.అప్పారావు, కోరారు.

'గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి'

అగనంపూడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు గల్లవానిపాలెం, కర్ణాల వీధి ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరైన డ్రైనేజీలు తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ సమస్యలను చెప్పుకున్నారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ డ్రైనేజీలు నిర్మించి మంచినీరు సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాలల్గొన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని వినతి

పెదగంట్యాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పెదగంట్యాడ తహశీల్దార్ అమలకు 75 వార్డు వైసీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస రెడ్డి వినతి పత్రం అందజేశారు. వినతిలో భాగంగా అదానీ సిమెంటు ఫ్యాక్టరీ కోసం పెదగంట్యాడలో 97, 98, 99, 101 పీ సర్వే నంబర్లులో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించి, బుధవారం ప్రజాభిప్రాయ సేకరణకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పత్రిక ప్రకటన ఇవ్వడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఒక వైపు గంగవరం పోర్టు కాలుష్యం, మరో వైపు డంపింగ్ యార్డుల దుర్వాసన వల్ల ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సిమెంటు ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

కూర్మన్నపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు సిద్ధార్థ నగర్ వద్దగల 12 ఎంఎల్‌డీ మంచి నీటి శుద్ధి కర్మాగారంలో వాటర్ మీటర్లు, వాల్వుల మార్పు, పైప్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నదని నీటి విభాగం ఏఈ కేదారినాథ్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 86, 87 వార్డుల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

వాల్మీకికి ఘన నివాళి

అగనంపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం జంక్షన్‌లో ఉన్న మహాత్మగాంధీ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొని వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

» గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని, రాష్ట్రప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డులో కొత్తగాజువాక, పెంటయ్యనగర్, బొజ్జనకొండ, ప్రాంతాల్లో రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాకలో ప్రతి వార్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.47 లక్షలతో రూపుదిద్దుకున్న మహిళా సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గొలగాని గోపీ, గూటూరు శంకరరావు, పల్లా రంగా, సింహాచలం, కమల్, ఆదారి రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి మంత్రి సత్యకుమార్

» స్వాగతం పలికిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



సత్యకుమార్ యాదవ్‌తో ఎమ్మెల్యేలు గణబాబు, బండారు తదితరులు

గోపాలపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ పశ్చిమ నియోజకవర్గ కేంద్ర కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించారు. అనంతరం దివంగత ఎంపీ పి.అప్పలనరసింహం విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి , కూటమి నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ వీవీపీ ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వీవీపీ ఉపాధ్యాయులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న విశాఖ విమల విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ తెలుగుతల్లి విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమను పట్టించుకోకుండా పక్కన పెట్టారన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇతర పాఠశాలలో చేరారని, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్కూల్ సిబ్బందికి ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



శతాబ్ది ఉత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

గాజువాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం నిస్వార్థంగా పనిచేసే సంస్థ ఆర్ఎస్ఎస్ అని ప్రముఖ వైద్యుడు గొర్లె సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్ మైదానంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం శ్రమించే సంస్థ ఆర్ఎస్ఎస్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంఘ్‌లో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయని, ఇది మంచి విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, కృష్ణ, వాసు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కొలువులు



కొలువులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుంధతి తదితరులు

అగనంపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల్లో 10 మంది రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ (ఆర్‌బీఎస్), నాట్ వెస్ట్ గ్రూపు సంస్థల్లో రూ.15 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. ఈ సదర్భంగా మంగళవారం కళాశాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విజ్ఞాన్ విద్యా సంస్థలు తగిన శిక్షణ ఇస్తోందన్నారు. విలువలతో కూడిన విద్య అందించడంతోనే ఇది సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ విభాగాధిపతి మనేంద్రసాయి, అధ్యాపక సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు జెర్సీల పంపిణీ



జెర్సీలు అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. అక్కిరెడ్డిపాలానికి చెందిన గొంతిన నూకరాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్థానిక హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆమె జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు అందజేసేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం ఎంఎల్ఎస్.కాంతం, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు

ముందస్తు పరీక్షలతో స్ట్రోక్స్‌కు చెక్

హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం

» జీవన విధానంలో మార్పులతోపాటు కొన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం

» సమస్యను ముందుగా గుర్తించి వైద్య సేవలందిస్తే ప్రాణాపాయం తప్పుతుందంటున్న వైద్య నిపుణులు





విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): **గత కొన్నాళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్నట్టు కనిపించిన వారెందరో కుప్పకూలిపో తున్నారు. మరికొందరు ఆస్పత్రుల్లో చేరి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ తరహా కేసుల సంఖ్య పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పలు టెస్టులను చేయించుకోవడం ద్వారా ఈ తరహా స్ట్రోక్‌లను నియంత్రించేందుకు అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఆహారపు అలవాట్లు, జీవన విధానంలో మార్పులు చేసుకోవడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా వీటికి చెక్ పెట్టవచ్చని పేర్కొంటున్నారు.**

గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు ప్రధానంగా రక్త ప్రసరణలో ఏర్పడే అడ్డంకులే కారణం. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం వల్ల గుండెపోటు వస్తుంది. ఈ అడ్డంకులు కొవ్వు, కొలెస్ట్రాల్ నిక్షేపాల వల్ల ఏర్పడతాయి. ఇవి క్రమంగా ప్లేక్స్‌గా (సున్నపు పెచ్చులు మాదిరి) మారతాయి. ఈ ప్లేక్స్ పగిలితే రక్తం గడ్డకట్టి, ధమని పూర్తిగా మూసుకుపోతుంది. దీనివల్ల గుండె కండరాలకు ఆక్సిజన్ అందక గుండెపోటు వస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ అంటే మెదడుకు రక్త ప్రసరణ అకస్మాత్తుగా నిలిచిపోవడం, అంతరాయం కలగడం. బ్రెయిన్ స్ట్రోక్‌ను రెండు రకాలుగా చెబుతారు. ఇందులో ఒకటి ఇస్కీమిక్ స్ట్రోక్, రెండోది హెమరేజిక్ స్ట్రోక్. మెదడులోని రక్తనాళంలో రక్తం గడ్డకట్టడం, అడ్డంకులు ఏర్పడడం వల్ల వస్తుంది. అలాగే మెదడులోని రక్తనాళం పగిలిపోవడం, రక్తస్రావం కావడం వల్ల కూడా హెమరేజిక్ స్ట్రోక్ వస్తుంది. బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్ రెండింటికీ రక్త సరఫరాలో ఏర్పడే అవాంతరాలు వల్లే వస్తుంటాయని, కాబట్టి ఇందుకు కారణాలుగా ఉన్న అంశాలపై దృష్టి సారించడం ద్వారా వాటికి చెక్ పెట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఈ పరీక్షలతో గుర్తించే చాన్స్..

ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ, షుగర్, బీపీ, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ ప్రొఫైల్, హోమో సిస్టిన్, ప్రొటీన్ బీ, సీ, ఎస్ వంటి పరీక్షలను చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ వంటి టెస్టులను చేయించుకోవడం ద్వారా గుండెలో ఏవైనా బ్లాకులు ఉన్నా, ఇతర సమస్యలున్నా ప్రాథమికంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏదైనా ఇబ్బంది ఉంటే స్టంట్, మందులు, ఆపరేషన్ ద్వారా తీవ్ర స్థాయికి వెళ్లకుండా కాపాడుకునేందుకు అవకాశం ఉంది. వీటితోపాటు షుగర్, బీపీ కూడా గుండెపోటుకు కారణమవుతాయి. ఇవే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడేందుకు మూల కారణాలుగా ఉంటాయని పేర్కొంటున్నారు. వీటితోపాటు కాల్షియం స్కోరింగ్ పరీక్షను చేయించుకోవాలి. కాల్షియం స్కోరింగ్ అధికంగా ఉండడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే చాన్స్ అధికంగా ఉంటుంది. అదేవిధంగా ప్రొటీన్ బీ, సీ, ఎస్ తక్కువగా ఉన్నా బ్రెయిన్ స్ట్రోక్ త్వరితంగా వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఆయా టెస్టులను 40 ఏళ్ల దాటిన వారందరూ ఆరు నెలలకొకసారి చేయించుకోవడం ద్వారా స్ట్రోక్స్ ముప్పును ముందే గుర్తించేందుకు అవకాశం ఉంది.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

ఒత్తిడితో ప్రస్తుతం అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వృత్తిపరమైన, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు చిన్న వయసులోనే చుట్టుముడుతున్నాయి. వీటిని అదుపులో ఉంచుకోలేకపోవడం, సకాలంలో సమస్యను గుర్తించకపోవడంతో చాలామంది స్ట్రోక్స్ బారిన పడుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే వారిలో చాలామందికి బీపీ ఉన్నట్టు కూడా తెలియడం లేదు. అలాగే కొన్ని రకాల అలవాట్లు కూడా వీటి బారినపడేలా చేస్తుంటాయి. ఖైనీ, గుట్కా, స్మోకింగ్ అలవాట్లు వల్ల రక్తాన్ని గడ్డకట్టించే మెకానిజం అధికంగా ఉంటుంది. ఇది స్ట్రోక్స్‌కు గురయ్యేందుకు దోహదం చేస్తుంది. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, శారీరక శ్రమ చేయడం, యోగా, మెడిటేషన్ వంటివి ఫాలో కావడం ద్వారా వీటికి కొంతవరకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంది.

వైద్య పరీక్షలతో ముప్పును ముందే గుర్తించవచ్చు



బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్స్‌కు కారణాలు ఎన్నో ఉన్నప్పటికీ జీవన విధానంలో వచ్చిన మార్పులు అంతిమంగా కీలకంగా మారుతున్నాయి. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, తీవ్రమైన ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు చేయడం వంటివన్నీ ఈ స్ట్రోక్స్‌కు కారణమవుతున్నాయి. వీటికి దూరంగా ఉండాలంటే జీవన విధానంలో మార్పులు చేసుకోవాలి. అదే సమయంలో కొన్ని రకాల పరీక్షలను 40 ఏళ్ల దాటిన ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించేందుకు అవకాశం ఉంది. ప్రాథమిక దశలో సమస్యను గుర్తిస్తే అందుకు అనుగుణంగా వైద్య సేవలు పొందడం ద్వారా తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ కె.సాగర్‌బాబు, కార్డియోథొరాసిక్ సర్జన్

అమ్మాయిల ముమ్మర సాధన



ఫుట్‌బాల్ ఆడుతున్న మహిళా క్రికెటర్లు

భారత మహిళా క్రికెటర్లు మంగళవారం సాయంత్రం పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ముమ్మర సాధన చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు.

– విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



క్రాంతిగౌడ్ బౌలింగ్ ప్రాక్టీస్



స్మృతి మంధాన బ్యాటింగ్

ఈకేవైసీ చేయించుకోవాలి

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులకు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ముఖ ఆధారిత హాజరు నమోదుకు ఈకేవైసీ చేయిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. వేతనదారుని ముఖాన్ని ఆధార్ కార్డులో ఉన్న ముఖంతో పోల్చి హాజరు నమోదు చేస్తారన్నారు. ఒకరికి బదులు మరొకరు పనిలోకి రాకుండా నియంత్రించేందుకు ఈ విధానం దోహదపడుతుందన్నారు. జిల్లాలో ఉపాధి పనులకు వచ్చే 47,725 మందికి ఈకేవైసీ చేయిస్తామన్నారు. వేతనదారులు ఆధార్, జాబ్‌కార్డులతో క్షేత్ర సహాయకుడి వద్దకు వెళ్లాలన్నారు. ఈకేవైసీ చేయించుకోలేని వారికి హాజరు, వేతనం చెల్లింపు అవకాశం లేనందున తప్పనిసరిగా అందరూ చేయించుకోవాలని పూర్ణిమాదేవి సూచించారు.

క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం కృషి

వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

సీతంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మనోధైర్యంతో క్యాన్సర్‌ని జయించవచ్చని, వ్యాధి నివారణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్‌లో మంగళవారం రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వైకల్ కాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందుంటుందన్నారు. రూ.3.500 విలువచేసే క్యాన్సర్ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రతి బాలిక ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. బాలికలు, యువతుల ఆరోగ్య పరిరక్షణకు వ్యాక్సిన్ కీలకమని, తల్లిదండ్రులు తప్పనిసరిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది బాలికలకు వ్యాక్సిన్ వేశారు. ఉత్తర, దక్షిణ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, రోటరీక్లబ్ అధ్యక్షుడు బి.శివాజీ, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ, రోటరీక్లబ్ ప్రతినిధులు కమల్ బేడ్ పీపీజీఎస్ రాజు, పీపీఆర్ రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో శేషురిషిత్‌కు కాంస్య పతకం



పతకంతో శేషురిషిత్

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెబర్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థి నల్లమిల్లి శేష రిషిత్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్టు స్కూలు అధినేత డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌మెహతా మాట్లాడుతూ సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో మొదటిసారిగా ఆంధ్ర నుంచి క్రీడాకారులు మంచి పోటీ ఇచ్చారన్నారు. విజేత శేషురిషిత్‌ను, ప్రిన్సిపాల్ వందనా బొహరాను, శిక్షకులు సతీష్, బేబీరెడ్డిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సుగుణారెడ్డి అభినందించారు.

మహాకవి వాల్మీకి కారణజన్ముడు: కలెక్టర్



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో భవానీ శంకర్, అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామాయణ మహాకావ్యాన్ని రచించి అన్నివర్గాల ప్రజలకు చేరువ చేసిన మహాకవి వాల్మీకి జీవిత విశేషాలను అందరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. మహర్షి వాల్మీకి జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా బి.సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి రామాయణంలో ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని, కారణ జన్ముడిగా నిలిచిన ఆయన రామాయణం నిలిచినంత కాలం ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై రాహుల్ పోరాటానికి మద్దతివ్వండి

» ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా గడిచిన ఎన్నికల్లో ఓట్లను చోరీ చేయడం ద్వారా ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఓట్ల చోరీ వ్యవహారంపై పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీకి ప్రజలు మద్దతుగా నిలవాలని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మ శ్రీ అభ్యర్థించారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ కార్యాలయం నుంచి సెవెన్ హిల్స్ హాస్పిటల్ మీదుగా రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రాహుల్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా చేపట్టిన ఓట్ చోర్.. గద్దె చోడ్ (ఓట్ల దొంగ గద్దె దిగండి) పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని దుయ్యబట్టారు. రాహుల్ చేస్తున్న పోరాటానికి మద్ధతుగా దేశవ్యాప్తంగా ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. పార్టీ కడప జిల్లా మాజీ అధ్యక్షుడు గుండ్లకుంట్ల శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. మరోనేత వజ్జపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కుట్రలు, కుతంత్రాలకు బీజేపీ నాయకులు తెరతీస్తున్నారని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు, విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు మౌనికా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం... crime news

చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు

» టవర్ లొకేషన్ డంప్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

» ఇన్‌ఫార్మర్ల సహాయంతో దొంగతనం జరిగిందనే కోణంలో దర్యాప్తు



కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన కారు

కంచరపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన చోరీ కేసులో నిందితుల ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ చోరీ కేసులో నిందితులు స్థానికులా..అంతర్రాష్ట్ర ముఠానా? అన్న కోణంలో పోలీసులు వివరాలను తెలుసుకుంటున్నారు. బాధిత ఇంటి యజమాని దర్మాన ఆనందకుమార్ రెడ్డి ఇంట్లో లేకపోవడం, భార్య కోమలి, కుమార్తె దేవికా రెడ్డి పైఫ్లోర్‌లో పడుకుంటారని, కింద రూమ్‌లో తల్లి ఎల్లమ్మ ఉంటారని నిందితులకు పక్కా సమాచారం అందించడంలో ఇన్‌ఫార్మర్లు ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో పరిశీలన జరుగుతోంది. చోరీ జరిగిన ప్రాంతంలో సెల్ టవర్స్ లోకేషన్స్ డేటా వివరాలను సైతం పోలీసులు అన్వేషిస్తున్నారు. చోరీ అనంతరం నిందితులు కారును మారికవలస ప్రాంతంలో విడిచిపెట్టి వెళ్లడంతో కారును పోలీసులు ఫింగర్ ప్రింట్స్ తీసుకుని కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. నిరంతరం వాహనాల రద్దీతో అలికిడిగా ఉండే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పక్కా ముందస్తు సమాచారంతోనే చోరీ జరిగిందని పలువురు విశ్వసిస్తున్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

పెందుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన సుజాతనగర్ వద్ద మంగళవారం జరిగింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్ సమీప హమ్మీనగర్‌కు చెందిన పాశగడుగులు అమ్మాజీ (60) మంగళవారం సాయంత్రం పువ్వులు కొనుగోలు చేసేందుకు బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా నగరం నుంచి పెందుర్తి వైపు వేగంగా వస్తున్న సిటీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో అమ్మాజీ అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కనకమ్మ ఆలయంలో ఎండోమెంట్స్ సెక్రటరీ



హరి జవహర్‌లాల్ దంపతులకు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

మహారాణిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారిని రెవెన్యూ, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్ లాల్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం శేష వస్త్రాలు, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత ఆలయ ఈవో శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ పరిశ్రమపై చర్చిద్దాం

» జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయండి

» మేయర్‌కు సీపీఎం, సీపీఐ, వైసీపీ ఫ్లోర్‌లీడర్ల వినతి



వినతిపత్రం చూపిస్తున్న కార్పొరేటర్లు

విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని పెదగంట్యాడ వద్ద అదానీ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి రద్దు చేయాలని తీర్మానం చేసేందుకు వీలుగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం తక్షణం ఏర్పాటుచేయాలని సీపీఎం, సీపీఐ, వైసీపీ ఫ్లోర్‌లీడర్లు బి.గంగారావు, ఏజే స్టాలిన్, బాణాల శ్రీనివాసరావు మేయర్ పీలా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు ముగ్గురూ మంగళవారం లేఖలను అందజేశారు. పెదగంట్యాడలో జనవాసాల మధ్య నాలుగు మిలియన్ టన్నుల సామర్థ్యంతో అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు బుధవారం ప్రజాభిప్రాయసేకరణ చేపడుతున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ప్రకటించిందన్నారు. ఈ పరిశ్రమ వల్ల గాజువాక మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నగర ప్రజలకు సరఫరా అయ్యే తాగునీరు కూడా కలుషితమైపోతుందని, ప్రజలకు ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని, ఈ నేపథ్యంలో పరిశ్రమకు అనుమతులను రద్దుచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కౌన్సిల్‌లో చర్చించి పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించడంతో పాటు, అనుమతులు రద్దుచేయాలని కోరుతూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని మేయర్‌ను కోరామన్నారు.

రేపటి నుంచి స్కూల్స్ గేమ్స్ జట్ల ఎంపిక

మద్దిలపాలెం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్స్ గేమ్స్ అండర్-19కు జట్లను ఎంపిక చేస్తున్నామని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి పి.ఉమారాణి తెలిపారు. ఈనెల 9నగోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, 10న నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాకీ, 13న నగరంలోని బీవీకే కళాశాలలో బాస్కెట్‌బాల్, కోకో, 14న శ్రీకృష్ణాపురంలో జిమ్నాస్టిక్స్, కలరియపాట్, 15న అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్, 17న పరవాడ ఎస్వీఎస్ కళాశాలలో కబడ్డీ, యోగా, చెస్, 18న చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్, 19న శ్రీకృష్ణాపురంలో హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలకు జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. విద్యార్థులు 2007 తర్వాత పుట్టి ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారై ఉండాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, పాన్ నంబరు, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులతో హాజరుకావాలన్నారు. ఓపెన్ స్కూల్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు అనర్హులన్నారు. ఉదయం 9 గంటలలోగా క్రీడా ప్రాంగణాలకు చేరుకోవాలని, వివరాలకు 94408 85898, 99669 31556, 98854 73808 నంబర్లలో సంప్రదించాలన్నారు.